www.peoplesnews.in

# హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 98 శనివారం, ఆగస్టు 22, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

**- అందుకే సిఎం రేవంత్ పర్యటనకు అనుమతి నిరాకరణ**
**- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ**



**న్యూఢిల్లీ,ఆగస్టు 21 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. దీనిపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. శుక్రవారం న్యూఢిల్లీలో ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే సీఎంలు, ఇతర ప్రముఖుల పర్యటనలను.. రాజకీయ క్లియరెన్స్ కోసం అంచనా వేస్తామని ఆయన వివరించారు. ప్రతిపాదిత కార్యక్రమం పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని ఈ సందర్భంగా జైస్వాల్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటన అంశంలో అలా లేదన్నారు. ఈ నేపథ్యంలో మిగతా2లో...



## చిత్ర పరిశ్రమలో విషాదం..

**దిగ్గజ నటి 'షావుకారు జానకి' కన్నుమూత!**

**హైదరాబాద్,ఆగస్టు 21 :**భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసిన అలనాటి ప్రముఖ సీనియర్ నటి 'షావుకారు' జానకి (94) తుదిశ్వాస విడిచారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత మిగతా2లో...

## గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**- అధికారులకు సంజయ్ జాజు ఆదేశం**



**హైదరాబాద్,ఆగస్టు 21 :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ? ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మిగతా2లో...

## తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

**హైకోర్టులో ముగిసిన వాదనలు: 16న తీర్పు వెలవరించనున్న హైకోర్టు**




## పెల్లెట్ గన్స్ ఉదంతంపై కేసు నమోదు



**న్యూఢిల్లీ,21:**ఢిల్లీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎదుట ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. తాజాగా రాహుల్ గాంధీ డిమాండ్ మేరకు పెల్లెట్ గన్స్ ఉదంతంపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. బాధితుని వైద్య నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయనున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెలువరించాయి. గత నెల జూలై 20న నీట్ పేపర్ లీక్ ను వ్యతిరేకిస్తూ విద్యార్థులు పార్లమెంట్ మార్చ్ కు శాంతియుత నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. విద్యార్థులపై పెల్లెట్ గన్ లతో భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో 19 ఏళ్ల సాహిల్ కు తీవ్ర గాయాలైయ్యాయి. బాధిత యువకుడితో కలిసి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్ మిగతా2లో...



## క్రమశిక్షణా కమిటీకి చెప్పాల్సింది చెప్ప..

**- కొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదు: కొండా సురేఖ**

**హైదరాబాద్,ఆగస్టు 21 :** కాంగ్రెస్ షోకాజ్ నోటీసుల అంశంలో తాను చెప్పాల్సింది క్రమశిక్షణ కమిటీకి చెప్పానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ విషయంపై ఇప్పుడు మీడియాతో మాట్లాడబోనని చెప్పారు. 'నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ మిగతా2లో...

## ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

**సవాళ్లను అవకాశంగా మార్చుకోవాలి: వర్క్‌షాపులో పలువురు మంత్రుల సూచన**







## జిఒ 150ను రద్దు చేయాలి: కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్,ఆగస్టు 21 :** తెలంగాణ స్థానిక విద్యార్థులకే ఎంబిబిఎస్ సీట్లు కేటాయించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శుక్రవారం నీట్ ర్యాంకులు సాధించిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కవితతో భేటీ అయ్యారు. ప్రభుత్వం 2024లో తీసుకువచ్చిన 150 జిఒ కారణంగా ఇతర రాష్ట్రాలకు మిగతా2లో...

## ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

**ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేయాలి: మంత్రి సీతక్క వెల్లడి**







## హత్య కేసులో 105 ఏళ్ల వృద్ధుడికి ఊరట

**- జీవిత ఖైదును రద్దు చేసిన సుప్రీం కోర్టు**

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# హత్య కేసులో 105 ఏళ్ల వృద్ధుడికి ఊరట

**న్యూఢిల్లీ,ఆగస్టు 21 :**హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష పడిన 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌లోని మల్ద జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మొండల్ 1920లో జన్మించారు. 1988లో మర్డర్ కేసులో ఆయన జైలు పాలయ్యారు. 1994లో కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. తనకు పడ్డ శిక్షను సవాల్ చేస్తూ మొండల్ 2018లో కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టేసింది.
తర్వాత అపెక్స్ కోర్టుకు వెళ్లగా.. అక్కడ కూడా మొండల్‌కు నిరాశే ఎదురైంది. దీంతో మొండల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వయసును దృష్టిలో ఉంచుకుని శిక్షా కాలం ముగియటానికంటే ముందే తనను రిలీజ్ చేయాలంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు 2024 నవంబర్ 29వ తేదీన మొండల్‌కు మధ్యంతర బెయిల్ మంజూర్ చేసింది. శుక్రవారం మరోసారి సుప్రీంకోర్టులో మొండల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ వయసును దృష్టిలో ఉంచుకుని కేసును ముగిస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. మిగిలిన శిక్షాకాలాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పుతో 105 ఏళ్ల వయసులో రసిక్ చంద్ర మొండల్ జీవిత ఖైదు నుంచి విముక్తి పొందారు.

# జిఓ 150ను రద్దు చేయాలి: కల్వకుంట్ల కవిత

(మొదటి పేజీ తరువాయి)

చెందిన విద్యార్థులకు ఎక్కువ సీట్లు వస్తున్నాయని.. ఫలితంగా తెలంగాణ ప్రాంత బిడ్డలకు అన్యాయం జరుగుతోందని వివరించారు. కవిత స్పందిస్తూ, వారం రోజుల్లో ఎంబిబిఎస్ సీట్లు అలకేట్ చేసే అవకాశ ఉండటంతో ప్రభుత్వం తెలంగాణ స్థానిక విద్యార్థులకు అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే విద్య సంవత్సరం నాటికి తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేసే జిఓ 150ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు నాలుగేళ్లు తెలంగాణలో చదివితే స్థానికత వర్తించేలా జిఓ 150 తేవడంతో ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి చదువుతోన్న విద్యార్థులకే ఎక్కువ ఎంబిబిఎస్ సీట్లు దక్కుతున్నాయని తెలిపారు. ఏటా సుమారు 1,500 నుంచి 2 వేల సీట్లు ఇతర రాష్ట్రాల విద్యార్థులకే దక్కుతున్నాయని, ఆ మేరకు తెలంగాణ విద్యార్థులకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఏడేళ్లు ఏ రాష్ట్రంలో జరిగితే అక్కడ స్థానికత వర్తించేలా పాత జిఓను పునరుద్ధరించాలని సూచించారు. నీట్ కారణంగా ఇప్పటికే 15 శాతం సీట్లు కోల్పోతున్నామని, ఏ రాష్ట్రంలో మెడికల్ సీట్ల భర్తీకి ఆ రాష్ట్రమే ఎంట్రన్స్ నిర్వహిస్తే సీట్లు కోల్పోవాల్సిన ఆస్కారమే ఉండదన్నారు. విద్యార్థుల భవిష్యత్ ముడిపడి ఉన్న ఈ అంశం అత్యంత సెన్సిటివ్ అని.. ప్రభుత్వం వారం రోజుల్లో ఒక నిర్ణయం తీసుకోకుంటే తెలంగాణ విద్యార్థులకు మళ్లీ అన్యాయం జరుగుతుందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ రెడ్డి వెంటనే ఈమేరకు చర్యలు చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

# గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. దేశంలోని వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సీఎస్ సూచించారు. అదేవిధంగా, దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, శాస్త్ర?సాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాల ప్రముఖులను సమ్మిట్‌లో పాల్గొనేలా ముందుగానే ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలను అప్పగించి సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా వివిధ రంగాలకు సంబంధించిన ఎక్స్‌పోలను ఏర్పాటు చేయాలని, వాటిలో ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ పేర్కొన్నారు. అలాగే, తెలంగాణ రైజింగ్ ? ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు మార్గదర్శకత్వం అందించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో కూడిన సలహా మండలి ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమ్మిట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి, తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్ఠించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శ్రీ శశాంక, పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

**హైదరాబాద్,ఆగస్టు 21 :**ఎల్‌నినో ప్రభావంతో రానున్న సవాళ్లను ముందుగానే గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్నిఅన్ని విధాలుగా సన్నద్ధం చేయాల ని పలువురు మంత్రులు అధికారులకు సూచించారు. ఎల్‌నినో సాధారణ పరిస్థితి కాదని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికొచ్చే సమయంలో నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమీకృత వ్యవసాయ కుంటల పాత్రపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, వ్యవసాయం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల సెక్రటరీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాకా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, ఈ విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమావేశం ఏర్పటు చేయడం హర్షనీయమని అన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగే స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, ప్రధాన జలాశయాల్లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో అందుబాటులో ఉండే భూగర్భ జలాలపై రోజువారీగా అంచనాలు రూపొందించి, వాటిని జాగ్రత్తగా వినియోగించేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో స్టార్టర్లతో రేయింబవళ్లు మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా, పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకునేలా రాష్ట్రంలోని 44 వేల చెరువులను సంరక్షించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. చెరువుల్లోకి వర్షపు నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టి, వాటిలో నీటిని నిల్వ చేస్తే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. వాగులు, నదుల్లో అవసరమైన ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాల నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చున్నారు. ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను సవాలుగా కాకుండా అవకాశంగా మలచుకోవాలని మంత్రి అన్నారు. కొత్త సాంకేతికత కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని, గతంలో మన తాతలు, తండ్రులు అనుసరించిన నీటి సంరక్షణ పద్ధతులను తిరిగి ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, పంచాయతీరాజ్, నీటిపారుదల తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి విపత్కర పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. జిల్లా స్థాయిలో అధికారులు ప్రతిరోజూ సమన్వయ సమావేశాలు నిర్వహించి తమ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. మండల స్థాయిలో మండల అధికారులు, జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులు, ప్రజలకు అధికారులు నమ్మకమైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు. నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే అధికారుల మాటను రైతులు, ప్రజలు విశ్వసిస్తారని, అధికారులు ప్రజలతో మానవీయ కోణంలో వ్యవహరించాలని అన్నారు.

# క్రమశిక్షణా కమిటీకి చెప్పాల్సింది చెప్పా..

(మొదటి పేజీ తరువాయి)

కమిటీకి చెప్పా. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను'అని కొండా సురేఖ అన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు వివరణ పంపారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని అందులో కోరారు. మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

**హైదరాబాద్,ఆగస్టు 21 :**ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమైనదని ఈ సందర్భంగా మంత్రి సీతక్క అభివర్ణించారు. మీరు ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేసి.. వారితో పనులు చేయించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతిరోజు రెండు లక్షల కంటే తక్కువగా కూలీల నమోదు ఉందని వివరించారు. శుక్రవారం హైదరాబాద్ లో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తప్పించిందని మండిపడ్డారు. వారిని తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ ప్రభుత్వం విధుల్లోకి తీసుకుందని గుర్తు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల మధ్య వేతనంలో వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు.
గ్రామ పంచాయతీ సైజు, పనుల కల్పనకు ముడి పెట్టకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ ఒకే విధంగా వేతనం ఉండేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని భరోసా కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు.. తమను ఎఫ్‌టీఈలుగా గా కన్వర్ట్ చేయాలని కోరుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో చర్చించి.. త్వరలో తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. ఆ సంఖ్యను కనీసం12 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉందని సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు కూలీలతో పనులు చేయించినప్పుడు.. మనం ఎందుకు చేయించ లేకపోతున్నామని ఫీల్డ్ ప్రతినిధుల బృందాన్ని మంత్రి సీతక్క సూటిగా ప్రశ్నించారు.

# చిత్ర పరిశ్రమలో విషాదం..

(మొదటి పేజీ తరువాయి)

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు.

అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పెల్లెట్ గన్స్ ఉదంతంపై కేసు నమోదు

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తన ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు ఇప్పటివరకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదని సాహిల్ ఆరోపించాడు. అయితే ఎఫ్‌ఐఆర్ నమోదు కాలేదని రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు.కేసు నమోదు చేసేవరకు స్టేషన్ నుంచి కదిలేది లేదని, నెల రోజులైనా, ఆరు నెలలైన ధర్నా చేస్తానని రాహుల్ గాంధీ భీష్మించారు.
మరోవైపు ఆనాటి ఘటనపై సుప్రీంకోర్టు గురువారం ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని (హెచ్‌పిఇసి) ఏర్పాటు చేసింది.
ఈ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి నేతృత్వం వహిస్తున్నారు .ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, ఈ కమిటీలో పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రవిశంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శాలిందర్ కౌర్, మాజీ సీబీఐ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, రిటైర్డ్ మేఘాలయ డీజీపీ ఎల్.ఆర్. బిష్ణోయ్ కూడా సభ్యులుగా ఉంటారని తెలిపింది.

# రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు క్లియరెన్స్ నిరాకరించామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. 10 రోజుల విదేశీ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం న్యూఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచి బయలుదేరి విదేశాలకు వెళ్లారు. ముందుగా అనుకున్న ప్రకారం.. ఆగస్టు 30వ తేదీ వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించ నుంది. ఈ రెండు దేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి తెలంగాణలో ఉన్నత విద్య, క్రీడల అభివృద్ధిపై ఈ బృందం చర్చించనుంది. అలాగే లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం బృందం సందర్శించనుంది. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో పాల్గొనుంది. అనంతరం యూఎస్‌కు సీఎం బృందం బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వ లేదు. దాంతో ఆయన లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అయితే యూఎస్ పర్యటనకు వెళ్లాలని అధికారుల బృందాన్ని సీఎం రేవంత్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

# తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

**హైదరాబాద్,ఆగస్టు 21 :** తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తరఫు న్యాయ వాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మెల్యేలు ప్రచా రం చేసిన వీడియోలను న్యాయస్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు. ఏఐసీసీ అధికారిక కార్యక్రమాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, వీరి వీడియోలు ంఃౌ ఆంధ్రజ్యోతిలో ప్రసారం అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని.. జాతీయ జెండాగా చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుందని గండ్ర మోహన్ రావు.. కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియో లను కూడా బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు. ఇరుపక్షాల వాదనలు పూర్తవడంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు హైకోర్టు పేర్కొంది.

# కక్షతోనే అడ్డుకున్నారు: మంత్రి వాకిటి



**హైదరాబాద్,ఆగస్టు 21 :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు రాజకీయ కక్షతోనే కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని మంత్రి వాకిటి శ్రీహరి ఆరోపించారు. సిఎం అమెరికా పర్యటనకు అ నుమతి నిరాకరణపై కేంద్ర మంత్రు లు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ప్రజలకు సమాధానం చె ప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. పేద, బడుగు, బలహీన, దళిత, మైనార్టీ వర్గాల పిల్లలకు ప్రపంచస్థా యి విద్యను అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమం త్రి అమెరికా పర్యటనకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సి ఎం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించడంద్వారా తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోలేరని వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుపై రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణకు ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలను తీసుకురావడం, విద్యా రంగంలో పెట్టుబడులు, అత్యుత్తమ విద్యా సంస్థల భాగస్వామ్యాలను రాష్ట్రానికి తీసుకురావడం వంటి అంశాల పై చర్చించాలన్నది సీఎం లక్ష్యమని పేర్కొన్నారు. అ మెరికా పర్యటనకు సంబంధించిన అన్ని వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే కేంద్ర ప్రభుత్వానికి అ ధికారికంగా పంపించినప్పటికీ అనుమతి నిరాకరించడం దురదృష్టకరమని మంత్రి అన్నారు.

# ఇథనాల్ కొరకు చెరుకు మళ్లింపు.. పంచదార కోసం దిగుమతులా?

- ఆహార భద్రతను పణంగా పెట్టి ఇంధన విధానం వద్దు:
- కాంగ్రెస్ అధికార ప్రతినిధి మదన్ మోహన్



**బాలానగర్ ఆగస్టు 22 ( పీపుల్స్ న్యూస్)**
దేశంలో పంచదార ధరలు పెరుగుతుండగా, మరోవైపు ఇథనాల్ ఉత్పత్తి కోసం చెరుకును భారీగా మళ్లిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానంపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి మదన్ మోహన్ తీవ్ర విమర్శలు చేశారు.ఒకప్పుడు పంచదార ఉత్పత్తి, ఎగుమతుల్లో ముందున్న భారత్.. నేడు దేశీయ అవసరాల కోసం 10 లక్షల టన్నుల ముడి పంచదారను డ్యూటీ రహితంగా దిగుమతి చేసుకునే పరిస్థితికి చేరడం కేంద్ర విధాన వైఫల్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఆగస్టులో పంచదార హోల్‌సేల్ ధరలు గణనీయంగా పెరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు.

పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలనే ఇ20 లక్ష్యం కోసం చెరుకులో గణనీయమైన భాగాన్ని ఇథనాల్ ఉత్పత్తికి మళ్లిస్తున్నారని, సుమారు 30 లక్షల టన్నుల పంచదార ఉత్పత్తి ఇథనాల్ వైపు మళ్లినట్లు నివేదికలు చెబుతున్నాయని మదన్ మోహన్ తెలిపారు. "క్రూడ్ ఆయిల్ దిగుమతులు తగ్గించుకోవడానికి ఇథనాల్ ఉత్పత్తిని పెంచుతూ.. అదే సమయంలో పంచదార కొరత వస్తే విదేశాల నుంచి పంచదార దిగుమతి చేసుకోవడం ఏ విధానం?" అని ఆయన ప్రశ్నించారు. ఇ20 విధానం వల్ల పాత వాహనాల్లో మైలేజ్ తగ్గడం, నిర్వహణ ఖర్చులు పెరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, దీనిపై కేంద్రం పారదర్శకమైన అధ్యయనాలు, స్పష్టమైన సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుకు గిట్టు బాటు ధర చక్కెర పరిశ్రమకు స్థిరత్వం.... వినియోగదారుడికి అందుబాటు ధర --- ఈ మూడు అంశాల మధ్య సమతుల్యత ఉండేలా కేంద్రం విధానాన్ని పునఃసమీక్షించాలని కోరారు. "ఇథనాల్ విధానం పేరుతో ఆహార భద్రతను దెబ్బతీయడాన్ని కాంగ్రెస్ అంగీకరించదు. పంచదార ధరలను నియంత్రించేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలి" అని మదన్ మోహన్ డిమాండ్ చేశారు.

# కనకదుర్గ ఆలయంలో వైభవంగా వరలక్ష్మీ వ్రత పూజలు

-- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. మహిళలకు పసుపు-- బొట్టు కుంకుమ, గాజుల పంపిణీ




**బాలానగర్ ఆగస్టు 22 ( పీపుల్స్ న్యూస్)**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఫతేనగర్ పరిధిలోని జవహర్ నగర్ కాలనీలో ఉన్న శ్రీ కనకదుర్గ దేవి, శీతలా దేవి, కాళికా దేవి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి, అభిషేకాలు, విశేష పూజలు, కుంకుమార్చనలు, సామూహిక అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వరలక్ష్మీదేవిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. మహిళల కోసం ప్రత్యేకంగా పసుపు--బొట్టు, కుంకుమ కార్యక్రమం నిర్వహించడంతో పాటు గాజులను పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో పండుగ వాతావరణాన్ని తలపించింది.
ఆలయ ప్రధాన పూజారి దోర్బల కాశీనాథ్ శర్మ పర్యవేక్షణలో, ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కాలనీవాసులు, ముఖ్యంగా మహిళా భక్తులు, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలతో జవహర్ నగర్ కాలనీలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

# బాలానగర్‌లో గంజాయి కలకలం.. ఇద్దరు మైనర్లు అరెస్ట్

- పాడుబడిన ఇంట్లో గంజాయి సేవిస్తున్నట్లు గుర్తింపు
- 3 గ్రాముల గంజాయి, అగ్గిపెట్టె, సిగరెట్ ముక్కలు స్వాధీనం.




**బాలానగర్ ఆగస్టు 22 ( పీపుల్స్ న్యూస్)**
నగరంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు చేపడుతున్న ప్రత్యేక తనిఖీల్లో ఇద్దరు మైనర్లు గంజాయి సేవిస్తూ సోమవారం పోలీసులకు పట్టుబడ్డారు. బాలానగర్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఓ పాడు బడిన ఇంట్లో గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో అక్కడ ఉన్న ఇద్దరు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3 గ్రాముల గంజాయి, అగ్గిపెట్టెతో పాటు గంజాయి సేవించేందుకు ఉపయోగించిన సిగరెట్ ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**-- పోలీసుల ప్రత్యేక నిఘా**
యువత, మైనర్లు మాదకద్రవ్యాల బారిన పడకుండా బాలానగర్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా పాడుబడిన ఇళ్లు, నిర్మానుష్య ప్రాంతాలు, యువత ఎక్కువగా సంచరించే ప్రదేశాలపై నిఘా పెంచినట్లు పోలీసులు వెల్లడించారు.
గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, వినియో గంపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మైనర్లను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**-- కేసు నమోదు.. దర్యాప్తు ముమ్మరం.......**
ఈ ఘటనపై బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మైనర్లకు గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది? వారికి సరఫరా చేస్తున్న వ్యక్తులు ఎవరైనా ఉన్నారా? అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. మాదకద్రవ్యాల వినియోగం వైపు మైనర్లు ఆకర్షితులు కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# ఘనం గా వరలక్ష్మీ వ్రతం వేడుకలు.....



**వెంకటాపూర్(రామప్ప) ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్21 (పీపుల్స్ న్యూస్)**
వెంకటాపూర్ మండలం లోని గ్రామాల్లో ఘనం గా వరలక్ష్మీ వ్రతం వేడుకలు మహిళలు ఘనం గా నిర్వహించుకోవడం జరిగింది.వెంకటాపూర్,లక్ష్మీదేవిపేట,పాలంపేట, నల్లగుంట గ్రామంలోనీ రామాలయాలో మహిళలు పెద్ద ఎత్తున వరలక్ష్మీ వ్రతం వేడుకలు నిర్వహించుకున్నారు.నల్లగుంట గ్రామం లో నల్లగుంట గ్రామ దేవాలయ కమిటీ ఆధ్వర్యం లో నల్లగుంట లో వేడుకలను ఘనం గా నిర్వహించడం జరిగింది.మహిళలు అంత లక్ష్మీ మాత కు పూజలు చేసి వ్రతం ఆచరిస్తారు.మహిళల ఒకరికి ఒకరు వాయినాలు ఇచ్చుకుంటారు పుచ్చుకుంటారు.ఈ కార్యక్రమంలో గ్రామ గుడి కమిటీ అధ్యక్షులు జనగాం రవీందర్,పురోహితులు,మహిళలు,రామగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సదాశివ పాఠశాలలపై సమగ్ర విచారణ చేపట్టాలి

- విద్యార్థుల భద్రతతో చెలగాటమాడుతున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- ఆర్ఎస్‌యూ, టీపీవైఎఫ్ సంఘాల డిమాండ్......



**బాలానగర్ ఆగస్టు 22 ( పీపుల్స్ న్యూస్)**
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, పరిధిలో ఉన్నటువంటి సదాశివ గ్రూప్ ఆఫ్ హైస్కూల్స్‌లో జరుగుతున్న అక్రమాలు, విద్యార్థుల భద్రత పట్ల యాజమాన్యం చూపుతున్న నిర్లక్ష్యంపై తక్షణమే ఉన్నతస్థాయి ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్, తెలంగాణ ప్రోగ్రెసివ్ యూత్ ఫెడరేషన్ డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఇరు సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ ఐఏఎస్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆర్ఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నగేష్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. సదాశివ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యజమాని శివరావుపై పలు ఆరోపణలతో బాలానగర్ మండల విద్యాధికారి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా విద్యాశాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు తగిన స్పందన లేదని ఆరోపించారు.
జిల్లాలో సుమారు పదకొండు పాఠశాల శాఖలు నిర్వహిస్తున్నారని, ప్రతి శాఖకు చట్టబద్ధమైన గుర్తింపు, అనుమతులు ఉన్నాయా అనే అంశంపై సమగ్రంగా విచారణ జరపాలని కోరారు. బాలానగర్ మండలం ఫిరోజ్‌గూడలో ఒకే అనుమతితో అనేక భవనాలు, విభాగాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఫిరోజ్‌గూడ, మేడ్చల్, అమీన్‌పూర్ ప్రాంతాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండానే కేంద్ర విద్యామండలి పేరుతో తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తూ అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై విచారణ చేపట్టాలని అన్నారు.

**-- విద్యార్థుల ప్రాణాలకు భద్రత లేదా?..........**
చిన్నారులు చదువుతున్న పాఠశాలలను నాలుగు అంతస్తుల భవనాల్లో నిర్వహిస్తున్నారని, ఆయా భవనాల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, అగ్నిమాపక అనుమతి పత్రం, భవన వినియోగ ధ్రువీకరణ పత్రం వంటి తప్పనిసరి భద్రతా ఏర్పాట్లు ఉన్నాయా లేదా పరిశీలించాలని కోరారు.విద్యార్థుల ప్రాణ భద్రతకు భరోసా కల్పించకుండా అధిక ఫీజులు వసూలు చేయడం సరికాదని, విద్యార్థుల భద్రత కంటే డబ్బుకే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. సదాశివ గ్రూప్ ఆఫ్ హైస్కూల్స్‌లోని ప్రతి శాఖకు సంబంధించిన గుర్తింపు, ప్రభుత్వ అనుమతులు, అగ్నిమాపక భద్రతా అనుమతి, భవన వినియోగ ధ్రువీకరణ పత్రం, పాఠశాల నిర్వహణకు సంబంధించిన ఇతర అనుమతులను పరిశీలించాలని కోరారు. అదేవిధంగా గతంలో వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోలేదని ఆరోపణలు ఎదుర్కొంటున్న సంబంధిత మండల, జిల్లా విద్యాశాఖ అధికారుల పాత్రపైనా విచారణ జరిపి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీవైఎఫ్ నాయకులు సిహెచ్. రాజు, దుర్గం శరత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ తహసిల్దారుగా జాలీ సునీతా రెడ్డి

- ఘనంగా శాలువాతో సత్కరించిన మీసేవ ఆపరేటర్లు బజ్జూరి వీరన్న, బజ్జూరి వేణు



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి ఆగస్ట్ 21 (పీపుల్స్ న్యూస్)** స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా ఉత్తమ తహసిల్దార్ అధికారిగా ఎంపికైన జాలీ సునీతా రెడ్డిని మొగుళ్లపల్లి మండలంలోని మీసేవ ఆపరేటర్లు బజ్జూరి వీరన్న, బజ్జూరి వేణులు శుక్రవారం తహసిల్దార్ కార్యాలయంలోని ఆమె చాంబర్ లో శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మొగుళ్ళపల్లి మండలంలోని ప్రజలకు, రైతులకు, ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ..మండల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ..రైతులకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తూ..రైతాంగ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్న జాలీ సునీతా రెడ్డిని జిల్లా ఉత్తమ తహసిల్దార్ అధికారిగా ప్రభుత్వ యంత్రాంగం నియమించడం అభినందనీయమని కొనియాడారు.

# తెలంగాణ రాష్ట్రం లో కొత్తపల్లి గ్రామ క్రీడాకారులు గర్వకారణం

- కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రేవంత్ రెడ్డి లక్ష్యం
- కాంగ్రేస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గం ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి



**రాజన్న సిరిసిల్ల జిల్లా/గంగరావుపేట/ఆగస్టు21**
తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు ఉద్యమమకారులవి అయితే భోగాలు మాత్రం బీ ఆర్ ఎస్ నాయకులవి అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గం ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు,కొత్తపల్లి గ్రామం లో త్రో బాల్ ఆటలో రాష్ట్ర స్థాయి లో గెలిచిన మహిళా క్రీడాకారులను అభినందించి జ్ఞాపికలను అందించారు,అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర లో కొత్తపల్లి గ్రామ క్రీడాకారులు త్రో బాల్ ఆట లో ప్రతిభ చాటి ఈ ప్రాంతానికి గర్వకారణం గా నిలిచారన్నారు,తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అనీ ఉద్యోగాలు ఇచ్చేది అభివృద్ధి చేసేది కూడా కాంగ్రె స్సే అని అన్నారు,కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యం గా సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు, క్రీడాకా రులకు ఓ అన్న గా ప్రోత్సాహం అందిస్తానని అన్నారు,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్శ హన్మాండ్లు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు హమీద్,నాయకులు రాజనర్సిం హ రెడ్డి,ఎలుక రాజు,గంగిస్వామి,అజం,రాజం ,రాజారాం రెడ్డి,గోపాల్రెడ్డి, గణేష్,దేవగౌడ్, రాజయ్య,శ్రీని వాస్,బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం సోషల్ మీడియా కన్వీనర్‌గా ప్రేమ్‌కుమార్.



**దౌల్తాబాద్ ఆగస్టు 21**
సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో ఉప సర్పంచుల ఫోరం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మాడుగురి రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉప సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తిక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం సోషల్ మీడియా కన్వీనర్‌గా సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామ ఉప సర్పంచ్ గొల్లపల్లి ప్రేమ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఫోరం రాష్ట్ర నాయకత్వానికి ప్రేమ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ఫోరం కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి దూస కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపగోని నవీన్‌కుమార్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మాడుగురి రాజు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆకుబత్తిని విజయ్‌కుమార్, జనగామ జిల్లా అధ్యక్షుడు పండగ హరీష్‌తో పాటు సిద్దిపేట జిల్లాలోని వివిధ గ్రామాల ఉప సర్పంచులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం: స్టూడెంట్ కౌన్సిలర్ బి. శివకుమార్.



**దౌల్తాబాద్ ఆగస్టు 21** ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎప్పుడూ విద్యార్థులకు శత్రువులు కాదని, వారి ప్రవర్తనలో సానుకూల మార్పు తీసుకురావడంతో పాటు, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు తరగతి గదిలో నిరంతరం శ్రమిస్తుంటారని దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ బి. శివకుమార్ అన్నారు.ఇటీవల జరిగిన రూపా రెడ్డి హత్య ఘటన తనను ఎంతగానో కలిచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మారుతున్న పరిస్థితుల్లో కొందరు విద్యార్థులు చెడు స్నేహాలు, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు, మొబైల్ ఫోన్ల ప్రభావానికి లోనై విచక్షణ, నైతిక విలువలకు దూరమవుతున్న పరిస్థితి బాధాకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహాలు, రోజువారీ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.విద్యార్థులకు కుటుంబం, ఉపాధ్యాయుల నుంచి సరైన దిశానిర్దేశం అందితే వారు మంచి మార్గంలో పయనించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇలాంటి విషాదకర ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. రూపా రెడ్డి కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రూపా రెడ్డి హత్యకు నిరసనగా బందు చేసిన కరస్పాండెంట్లకు ధన్యవాదాలు

**- ట్రస్మా జిల్లా అధ్యక్షులు పాల కూర్ల వెంకటేశం**



**వలిగొండ ఆగస్టు 21**
దేవరకొండ పరిధిలోని కొండమల్లేపల్లి కి చెందిన ప్రిన్సిపల్ రూపా రెడ్డి హత్యకు నిరసనగా శు క్రవారం బందు చేసిన కరస్పాండెంట్ మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపిన ట్రస్మ జిల్లా అధ్యక్షులు పాలకుర్ల వెంకటేశం అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రిన్సిపల్ రూపా రెడ్డి విద్యార్థుల ప్రవర్తన సరిగా లేనందుకు మందలించినందుకు ఆమెను హత్య చేశారు అసలు సమాజం ఎటువైపు పోతుంది దీనికి బాధ్యత వహించవలసింది ఎవరు ఇప్పటివరకు ప్రభుత్వం గాని మహిళా సంఘాలు స్పందించకపోవడం చాలా బాధాకరం మహిళా ప్రిన్సిపల్ అతి దారుణంగా చంపిన నరరూప రాక్షసులను శిక్షించవలసిన ఎంతైనా ఉంది ఈ మత్తు పానీయాలకు అలవాటై ఇంకా ఎంతమంది భలే ప్రమాదం ఉంది సభ్య సమాజం ఆలోచించవలసిన అంశం అని అన్నారు.

## వానలు సమృద్ధిగా కురవాలని నీటి బిందెలతో బతుకమ్మ ఆట



**రాజాపేట, ఆగస్టు 21**
వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ మండలంలోని దూది వెంకటాపురం గ్రామ మహిళలు శుక్రవారం వినూత్నంగా బతుకమ్మ ఆడారు. నీటి బిందెలను పెట్టి బతుకమ్మ పాటలు పాడుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.వర్షాలు సకాలంలో కురిసి చెరువులు, కుంటలు నిండాలని, పంటలకు సాగునీరు అందాలని ఆకాంక్షిస్తూ మహిళలు సామూహికంగా బతుకమ్మ ఆడారు. నీటి కొరత తొలగి గ్రామంలో పాడిపంటలు కళకళలాడాలని వేడుకున్నారు.వానల కోసం బతుకమ్మ ఆడిన మహిళలు అనే ఈ వినూత్న కార్యక్రమం స్థానికంగా అందరి దృష్టిని ఆకర్షించింది. సంప్రదాయాన్ని పాటిస్తూ వర్షాల కోసం ప్రార్థనలు చేయడం విశేషంగా నిలిచింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నడిమింటి నరేష్ , వార్డు సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయంను సందర్శించిన ఎంసిహెచ్ ఆర్ డి శిక్షణ అధికారులు















**రామప్ప ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 21,( పీపుల్స్ న్యూస్)**
మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శుక్రవారం హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న అధికారులు భారత్ దర్శన్ లో భాగంగా రామప్ప దేవాలయంను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం గురించి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మ డి భాస్కర్, ఎంసిహెచ్ఆర్డి అధికారులు శంకర్, నందకిషోర్,, రవి, ఆర్ ఐ రమేష్, టూరిస్ట్ పోలీసులు, రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ ల సమస్యల పరిష్కారానికి మా ప్రభుత్వం సానుకూలంగా ఉంది

**- మంత్రి సీతక్క**















**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 21 (పీపుల్స్ న్యూస్)**
ఏండ్లుగా వారి సమస్యలు పరిష్కారం కాలేదు
గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్ లను విధుల నుంచి తప్పించింది
తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్లను మేము విధుల్లోకి తీసుకున్నాము
ఫీల్డ్ అసిస్టెంట్ ల మధ్య వేతన వ్యత్యాసం ఉంది
గ్రామపంచాయతీ సైజు, పనుల కల్పనకు ముడి పెట్టకుండా ఫీల్డ్ అసిస్టెంట్ లందరికీ ఒకే రకమైన వేతనం ఉండేలా చర్యలు
ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తాము
ఫీల్డ్ అసిస్టెంట్లు.. తమను ఎఫ్ టి ఈ లు గా కన్వర్ట్ చేయాలని కోరుతున్నారు డిప్యూటీ సీఎం, సీఎం లతో చర్చించి త్వరలో నిర్ణయం ప్రకటిస్తాము గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకం
మీరు ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేసి పనులు చేయించాలి ప్రస్తుతం ప్రతిరోజు రెండు లక్షల కంటే తక్కువగా కూలీల నమోదు ఉంది
ఆ సంఖ్యను కనీసం 12 లక్షలకు పెంచాలి
ఇతర రాష్ట్రాలు కూలీలతో పనులు చేయించినప్పుడు.. మనం ఎందుకు చేయించలేకపోతున్నాం
ఫీల్డ్ అసిస్టెంట్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించి ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి

# రామప్పలో వైభవంగా వరలక్ష్మి వ్రతం






(రామప్ప)ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 21( పీపుల్స్ న్యూస్)

శ్రావణ శుక్రవారం సందర్భంగా ములుగు జిల్లాలోని ప్రసిద్ధ రామప్ప దేవాలయంలో వరలక్ష్మి వ్రతాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వేదమంత్రాలను ఘనంగా పఠిస్తూ వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు.శ్రావణ మాసంలోని శుక్రవారం రోజున వరలక్ష్మి వ్రతం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కుటుంబ సుఖశాంతులు, సౌభాగ్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా రామప్ప ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. పాలంపేట గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాల ఘోష, భక్తుల పూజలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించు కున్నాయి.వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ సిబ్బంది సహకరించారు.

# బాలికల హాస్టల్ నుంచి దుర్గంధం

- పట్టించుకోని వార్డెన్, అధికారులపై స్థానికుల ఆవేదన



ఏటూరునాగారం ప్రతినిధి ఆగస్ట్ 21( పీపుల్స్ న్యూస్)

ఏటూరునాగారం మండల కేంద్రంలోని తాళ్లగడ్డ ఆశ్రమ పాఠశాలలో సమస్యలు పరిష్కరించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికుడు కందకట్ల సతీష్ ఆరోపించారు. పాఠశాల ప్రాంగణంలోని పైపులు పగిలిపోవడంతో పాటు గోడ కూలిపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం ఇళ్లలోకి వస్తోందన్నారు. గోడ కూలి చాలాకాలమైనా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్ లింగయ్యకు పలుమార్లు తెలిపినా స్పందించలేదన్నారు. ఐటీడీఏ ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవన్నారు. కూలిన గోడ, పగిలిన పైపులు, దుర్గంధంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని కందకట్ల సతీష్ కోరారు.

# ఖమ్మం గడ్డపై జర్నలిస్టుల గర్జన!

- మాట నిలబెట్టుకోండి.. ఇళ్ల స్థలాలివ్వండి!
- హక్కుల సాధనకే పాత్రికేయుల రణభేరి!
- షోయబుల్లాఖాన్ స్ఫూర్తితో గళమెత్తిన పాత్రికేయులు



ఖమ్మం/ఆగస్టు 21/(పీపుల్స్ న్యూస్ )

తమ చిరకాల ఆకాంక్ష అయిన సొంతింటి స్థలం సాధన కోసం ఖమ్మం జిల్లా వర్కింగ్ జర్నలిస్టులు సమరశంఖం పూరించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్—హెచ్ 2843) జిల్లా కమిటీ పిలుపు మేరకు ఈ నెల 22 నుంచి జిల్లా వ్యాప్తంగా భారీ పాదయాత్ర చేపట్టనున్నట్లు యూనియన్ నియోజకవర్గ నాయకులు ఎన్టీ కర్త ప్రకటించారు. శుక్రవారం నేలకొండపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యాత్ర కార్యాచరణను వివరించారు.అమరవీరుడు గడ్డపై ఉద్యమ శంఖారావంనిజాం నిరంకుశత్వానికి ఎదురొడ్డి ప్రాణాలర్పించిన అమర జర్నలిస్టు షోయబుల్లాఖాన్ వర్ధంతి రోజే ఈ పాదయాత్రకు శ్రీకారం చుడుతున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సుమారు 15 రోజుల పాటు సాగే ఈ యాత్రలో భాగంగా ప్రతీ మండల కేంద్రంలోనూ తహశీల్దార్లను కలిసి సమస్య తీవ్రతను వివరిస్తూ వినతిపత్రాలు అందజేయనున్నారు.కేవలం తమ న్యాయమైన హక్కును ప్రభుత్వానికి గుర్తుచేసే శాంతియుత ఉద్యమమని నేతలు స్పష్టం చేశారు. ఈ పోరాటానికి ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని, జిల్లాలోని జర్నలిస్టులంతా ఏకతాటిపైకి వచ్చి పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పాత్రికేయులు మోర సైదులు, రామదాసు, శివాజీ, దుద్దెల సంజయ్, పంబ రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ఎన్టీపీసీ లక్ష్యం

- దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత
- జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు 40 డ్యూయల్ డెస్క్ బెంచీల పంపిణీ
- బాలికలకు యోగా, స్వీయ రక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) శిక్షణ ప్రారంభం

రామగుండం (జ్యోతినగర్) ఆగస్ట్ 21 (పీపుల్స్ న్యూస్)








విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని, శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు ఎన్టీపీసీ నిరంతరం కృషి చేస్తుందని దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత తెలిపారు. ఎన్టీపీసీ రామగుండం ఒ తెలంగాణ ప్రాజెక్ట్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి.ఎస్.ఆర్) ఆధ్వర్యంలో జ్యోతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పలు సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు సౌకర్యవంతమైన అభ్యసన వాతావరణాన్ని కల్పించేందుకు 40 డ్యూయల్ డెస్క్ బెంచీలను పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. అనంతరం బాలికల్లో మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేకంగా రూపొందించిన మూడు నెలల "యోగా మరియు స్వీయ రక్షణ శిక్షణ" కార్యక్రమాన్ని రాఖీ సమంత ప్రారంభించారు.ఈ శిక్షణలో పాల్గొంటున్న 8, 9 తరగతుల బాలికలకు ఉచితంగా యోగా మ్యాట్లు, టీ-షర్టులు, ట్రాక్ ప్యాంట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి, సమాజంలో వారు ఆత్మవిశ్వాసంతో ఎదుగడానికి ఎన్టీపీసీ ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ అధికారులు, దీప్తి మహిళా సమితి ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అపరమేధావి డా. దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో మాజీ కేంద్రమంత్రి ఆలె నరేంద్ర 80వ జన్మదిన వేడుకలు



ఖమ్మం /ఆగస్ట్ 21/(పీపుల్స్ న్యూస్ )

నేలకొండపల్లిలో శుక్రవారం నాడు అపరమేధావి డా. దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో మాజీ కేంద్రమంత్రి ఆలె నరేంద్ర 80వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. దివ్యమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యమూర్తి మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆలె నరేంద్ర కృషి కీలకమైనదని హిమాయత్ నగర్ నుండి మూడుసార్లు ఎమ్మెల్యే, మెదక్ నుండి రెండుసార్లు ఎంపీ, ఒకసారి కేంద్రమంత్రి పదవులు చేశారని, తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేశారని ఇలాంటి మహనీయుడు జయంతిని నిర్వహించుకోవడం ప్రతి ఒక్కరికి అవసరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గండికోట సుబ్రమణ్యం, అపరమేధావి అభిమానుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరేపల్లి జ్ఞాన రత్నం, జాతీయ సామాజిక సేవా అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు, అభిమానుల సంఘం రాష్ట్ర సమన్వయకర్త కట్టెకోల వెంకటేశ్వర్లు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ఐదుగురు అరెస్ట్

- బైక్ రిపేర్ చేయాలంటూ వేధింపులు.. ఆత్మహత్య చేసుకుంటానని చెప్పినా వినలేదని పోలీసుల వెల్లడి
- మాసబ్ ట్యాంక్ పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు

హైదరాబాద్ కమిషనరేట్ క్రైమ్ బ్యూరో ఆగస్టు 21 (పీపుల్స్ న్యూస్)

యువకుడిని ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ఐదుగురు నిందితులను మాసబ్ ట్యాంక్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఆసిఫ్ నగర్ డివిజన్ ఏసీపీ కె. శ్రీనివాసు కేసు వివరాలను వెల్లడించారు.చార్మినార్ ప్రాంతానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి మీర్ సోఫియాన్ అలీ అలియాస్ ఆదిల్ (24) ఆగస్టు 20న తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**బైక్ విషయంలో వివాదం**

పోలీసుల దర్యాప్తు ప్రకారం.. సుమారు నాలుగు నెలల క్రితం ఏ-1 మహమ్మద్ హంజలా పాషా, ఏ-2 మహమ్మద్ ఇసాక్ ఉద్దీన్‌లు తమ రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్‌ను మృతుడికి ఇచ్చారు. ఆ బైక్ ప్రమాదానికి గురై దెబ్బతినడంతో మృతుడి ఇంటి వద్దే ఉంది.బైక్‌ను పూర్తిగా మరమ్మతులు చేయించి ఇవ్వాలని లేదా నష్టపరిహారం చెల్లించాలని ఏ-1, ఏ-2లు బాధితుడిపై ఒత్తిడి తెచ్చినట్లు పోలీసులు తెలిపారు. తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని బాధితుడు చెప్పినా నిందితులు ఒత్తిడి కొనసాగించినట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు.

**టెర్రస్‌పై వేధింపులు**

ఆగస్టు 19--20 మధ్యరాత్రి మాసబ్ ట్యాంక్‌లోని మార్వా లిబర్టీ అపార్ట్‌మెంట్ ఏడో అంతస్తు టెర్రస్‌పై నిందితులు సమావేశమైనట్లు పోలీసులు తెలిపారు. రాత్రి సుమారు 2 గంటల సమయంలో బాధితుడిని అక్కడికి పిలిపించి బైక్ మరమ్మతులు చేయించి ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు పేర్కొన్నారు. తాను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని, వేధింపులు కొనసాగితే ఆత్మహత్య చేసుకుంటానని బాధితుడు చెప్పినప్పటికీ నిందితులు పట్టించుకోకుండా వేధింపులకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాధితుడు ఏడో అంతస్తు టెర్రస్ నుంచి కిందకు దూకినట్లు పోలీసులు తెలిపారు.తీవ్ర గాయాలైన బాధితుడిని తొలుత మహవీర్, కేర్ ఆసుపత్రులకు తరలించి అనంతరం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆగస్టు 20 మధ్యాహ్నం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

**ఐదుగురు అరెస్ట్**

ఈ కేసులో---

ఏ-1: మహమ్మద్ హంజలా పాషా అలియాస్ సోఫియాన్ (24)
ఏ-2: మహమ్మద్ ఇసాక్ ఉద్దీన్ (25)
ఏ-3: ముస్తఫా ఖాన్ అలియాస్ ఫుర్ఖాన్ (25)
ఏ-4: మహమ్మద్ నవాజ్ (23)
ఏ-5: ఎండీ ఇమ్రాన్ ఖాన్

లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

సేకరించిన ఆధారాల ఆధారంగా కేసును బీఎన్ఎస్ సెక్షన్ 108 ఆర్/డబ్ల్యూ 3(5) కింద ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసుగా మార్పినట్లు ఏసీపీ కె. శ్రీనివాసు తెలిపారు. ఐదుగురు నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

# హైదరాబాద్‌లో గంజాయి ముఠా అరెస్ట్.. 39 కిలోల గంజాయి సీజ్

హైదరాబాద్, ఆగస్టు 21: నగరంలో గంజాయి అక్రమ రవాణా ముఠాపై పోలీసులు కొరడా ఝళిపించారు. గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విశాఖపట్నం నుంచి ముంబైకి రైలు మార్గంలో భారీగా గంజాయిని తరలించేందుకు యత్నించిన ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి మొత్తం 39 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గాంధీనగర్, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి బోయిగూడలోని రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని రైలు మార్గంలో తరలిస్తూ నగరాన్ని ట్రాన్సిట్ పాయింట్‌గా ఉపయోగించుకునేందుకు నిందితులు ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు.అరెస్టైన ఐదుగురు నిందితులు తమిళనాడు, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందినవారిగా పోలీసులు వెల్లడించారు. విశాఖపట్నం నుంచి గంజాయిని సేకరించి ముంబైకి తరలించే క్రమంలో హైదరాబాద్‌కు చేరుకున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలుస్తోంది. నిందితుల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు.. పక్కా సమాచారంతో దాడి చేసి వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా? గంజాయి సరఫరా నెట్‌వర్క్‌లో నిందితుల పాత్ర ఏమిటనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# హఫీజ్‌పేట్ రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తి మృతి

**- మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన**

**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో ఆగస్టు 21 (పీపుల్స్ న్యూస్)**
మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్‌పేట్ రోడ్డులో జెన్‌ప్యాక్ట్ సమీపంలో సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ నెల 19వ తేదీన మధ్యాహ్నం 1:18 గంటలకు జెన్‌ప్యాక్ట్ సమీపంలోని హఫీజ్‌పేట్ రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గుర్తించిన పోలీసులు, వెంటనే చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఈ నెల 21వ తేదీ ఉదయం 7:20 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు తెలుపు రంగు షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు, కుటుంబ సభ్యుల ఆచూకీ ఇంకా తెలియరాలేదు. మృతుడి గురించి ఏవైనా వివరాలు తెలిసిన వారు మియాపూర్ పోలీస్ స్టేషన్ సీఐ: 87126 63170 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. మృతుడి కుటుంబ సభ్యులను గుర్తించేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# మత్తుపదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం క్షీణించడమే

**- గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి**

**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో ఆగస్టు 21 (పీపుల్స్ న్యూస్)**
మత్తుపదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం క్షీణించడమేనని గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మల్లేపల్లి, అఫ్జల్‌సాగర్, మంగర్ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో మత్తుపదార్థాల (డ్రగ్స్) వాడకం , వాటి దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి, ఆసిఫ్‌నగర్ డివిజన్ ఏసీపీ కె. శ్రీనివాసు, హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్హెచ్ఓ) టి. పురుషోత్తమ రావు, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ఎస్. సైదులు, అడ్మిన్ ఎస్ఐ కె. మురళి గౌడ్, ఎస్ఐ ఎం. అశోక్ కుమార్ ల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో డ్రగ్స్ వ్యసనం వల్ల కలిగే తీవ్రమైన పరిణామాలు, అనర్థాల గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం. మత్తుపదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం క్షీణించడమే కాకుండా, విద్యావకాశాలు, ఉపాధి, కుటుంబ జీవనం , యువత ఉజ్వల భవిష్యత్తు ఏ విధంగా దెబ్బతింటుందో పోలీసు అధికారులు సమావేశంలో సోదాహరణంగా వివరించారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్‌కు ఆకర్షితులు కాకూడదని, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకుంటూ సురక్షితమైన మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పోలీసులు సూచించారు. డ్రగ్స్ బారిన పడిన స్నేహితులు ,. కుటుంబ సభ్యులను గుర్తించి వారికి సకాలంలో తగిన వైద్య, మానసిక సహాయం అందించాలని ఉద్ఘాటించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలు, యువత పోలీసు శాఖకు చురుకుగా సహకరించాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని ముగించారు.

# బోర్‌వెల్ కార్మికుడు అదృశ్యం

**సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో ఆగస్టు 21 (పీపుల్స్ న్యూస్)**
ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన జీత్ రామ్ కశ్యప్ (57), తండ్రి దశరథ, గత 20 రోజుల క్రితం తన గ్రామానికి చెందిన వారితో కలిసి హైదరాబాద్‌కు వచ్చి బోర్‌వెల్ బండిపై పనికి చేరాడు. మక్తా మహబూబ్‌పేటకు చెందిన రవీందర్ రెడ్డి వద్ద పనిచేస్తూ, ఆయన వద్దే నివాసం ఉంటున్నాడు. ఈ నెల 17వ తేదీన అవంతి ఎన్‌క్లేవ్, మదీనాగూడ ప్రాంతంలో పనికి వెళ్లిన జీత్ రామ్ కశ్యప్ ఉదయం సుమారు 10 గంటల సమయంలో తన తోటి కార్మికుడికి బాత్‌రూమ్‌కు వెళ్లి వస్తానని చెప్పి అక్కడి నుంచి వెళ్లాడు. అయితే తిరిగి పనివద్దకు రాలేదు. అతని కోసం పరిసర ప్రాంతాలతో పాటు తెలిసిన ప్రదేశాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో బోర్‌వెల్ యజమాని మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అదృ శ్యమైన జీత్ రామ్ కశ్యప్ ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి వివరాలు:జీత్ రామ్ కశ్యప్, వయస్సు 57 సంవత్సరాలు, తండ్రి: దశరథ, స్వస్థలం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం. ఆయన ఆచూకీ తెలిసిన వారు సమీపంలోని మియాపూర్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.



# రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలంపై జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ

**హైదరాబాద్ కమిషనరేట్** రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలంపై జోక్యం చేసుకునేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఏదైనా ఉంటే హైకోర్టులోనే తేల్చుకోవాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే రాయదుర్గం పాన్?మక్తా వద్ద రెండు సర్వే నంబర్లలో సుమారు 11 ఎకరాల భూమి అమ్మకం కోసం టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేశారు. దీనిపై జువ్వాడి ప్రణయ సంహారావు రిట్? పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్?పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పటిషనర్? తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఒక్కో ఎకరాకు రూ. 175 కోట్లు కనీస ధరగా నిర్ణయించి, సుమారు 11 ఎకరాలకు టీజీఐఐసీ నోటిఫికేషన్ ఇచ్చిందని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని, అప్పుడు రక్షించమని చెప్పిన భూములనే ఇప్పుడు వేలం వేస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది నీరజ్ కిషన్?కౌల్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. తదుపరి విచారణకు నిరాకరణ : పిటిషనర్ కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఆ భూములకు, ఇప్పుడు వేలం వేయడానికి నోటిఫికేషన్ ఇచ్చిన భూములకు సంబంధం లేదని కోర్టుకు తెలిపారు. కంచ గచ్చిబౌలికి ఇప్పుడు వేలం వేసే భూములు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వాదనను పరిగణనలోకి తీసుకున్న సీజే ధర్మాసనం టీజీఐఐసీ ఇచ్చిన నోటిఫికేషన్‌లో తాము జోక్యం చేసుకోబోమని తెలిపింది. పిటిషన్‌పై తదుపరి విచారణకు నిరాకరించింది.



# సాంకేతిక విద్యను నిరుపేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు దూరం చేయెద్దు

- ●GO నంబర్ 97పై పాలిటెక్నిక్ విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆందోళన
- ●పాలిటెక్నిక్, ఐటీఐలను సాంకేతిక విద్యాశాఖలోనే కొనసాగించాలి
- ●ఫీజుల భారం, ప్రవేశ విధానం, ఉద్యోగ భద్రతపై ఆందోళన
- ●ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్



**హైదరాబాద్, ఆగస్టు 21 (పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం పాలిటెక్నిక్ విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోందని పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థి, పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ (డిఎస్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎరవెల్లి జగన్ అన్నారు. పాలిటెక్నిక్ విద్యతో పాటు ఐటీఐ, ఏటీసీ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి సంబంధించిన జీవో నంబర్ 97పై ప్రభుత్వం పునరాలోచించాలని ఆయన డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్, ఐటీఐ విద్యను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాలు, పూర్వ విద్యార్థులు ఆందోళనలు, ధర్నాలు, కలెక్టరేట్ల ముట్టడి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని జగన్ తెలిపారు.

**పేద విద్యార్థులకు సాంకేతిక విద్యే ఆధారం**
పదో తరగతి అనంతరం త్వరగా సాంకేతిక నైపుణ్యాలు సాధించి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందాలనుకునే విద్యార్థులకు ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యలు కీలకమైనవని ఆయన పేర్కొన్నారు. ఐటీఐలో ప్రాక్టికల్ నైపుణ్యాలకు అధిక ప్రాధాన్యత ఉండగా, పాలిటెక్నిక్‌లో ఇంజనీరింగ్ సిద్ధాంతాలతో పాటు ప్రాక్టికల్స్‌కు సమాన ప్రాధాన్యత ఉంటుందని వివరించారు.
డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అనేక ఉద్యోగ అవకాశాలతో పాటు ఉన్నత విద్యకు కూడా మార్గం ఉంటుందని తెలిపారు. డిప్లొమా అనంతరం ఈసెట్ ద్వారా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశించే అవకాశం విద్యార్థులకు ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు చదువుతున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులు అధికంగా ఉన్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో సాంకేతిక విద్యను ఖరీదైన విద్యగా మార్చే నిర్ణయాలు పేద విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**ఫీజుల భారం పెరిగే ప్రమాదం?**
యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పబ్లిక్--ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో కొనసాగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఫీజుల నిర్మాణంలో మార్పులు వస్తే ఆ భారం విద్యార్థులపై పడే అవకాశం ఉందని జగన్ పేర్కొన్నారు.
ప్రస్తుతం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో తక్కువ ఫీజులతో విద్య అందుతున్నప్పటికీ, విశ్వవిద్యాలయ పరిధిలో ఫీజులు, ప్రవేశ రుసుములు, హాస్టల్ తదితర ఛార్జీల నిర్ణయాధికారం మారితే గ్రామీణ, పేద విద్యార్థులకు డిప్లొమా విద్య అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు.

**POLYCET భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలి**
పాలిటెక్నిక్ ప్రవేశాల్లో POLYCET ద్వారా మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా కేంద్రీకృత కౌన్సెలింగ్ విధానం అమలవుతోందని జగన్ తెలిపారు. ప్రస్తుత ప్రవేశ విధానంలో మార్పులు వస్తే పారదర్శకత, మెరిట్, రిజర్వేషన్ విధానాలపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.
పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు, ప్రవేశ విధానం, సర్టిఫికెట్ల విలువపై ప్రభుత్వం పూర్తి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆస్తుల రక్షణ అవసరం**
దశాబ్దాలుగా ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల భూములు, భవనాలు, వర్క్‌షాప్‌లు, ల్యాబొరేటరీలు ప్రజా ఆస్తులని జగన్ గుర్తుచేశారు. ఈ ఆస్తుల నిర్వహణ, నియంత్రణలో మార్పులు జరిగితే ప్రభుత్వ ఆస్తులపై ప్రైవేట్ ప్రయోజనాల ప్రభావం పెరగకుండా ప్రభుత్వం స్పష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రతపై హామీ ఇవ్వాలి**
ఎస్‌బీటెట్, సాంకేతిక విద్య పరిధిలో పనిచేస్తున్న పాలిటెక్నిక్ అధ్యాపకులు, ఉద్యోగుల సర్వీస్ రూల్స్, కేడర్, పదోన్నతులు, పింఛన్ తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీ విధానాలు పెరగకుండా రెగ్యులర్ ప్రభుత్వ ఉపాధ్యాయ నియామకాలను కొనసాగించాలని కోరారు.

**ఇంజనీరింగ్ ప్రాథమిక విద్యను బలహీనపరచొద్దు**
పాలిటెక్నిక్ విద్య కేవలం ఉద్యోగ నైపుణ్యాలకు పరిమితం కాకుండా గణితం, సైన్స్, ఇంజనీరింగ్ ప్రాథమిక సూత్రాలను విద్యార్థులకు అందిస్తుందని జగన్ తెలిపారు. ఈ విద్యా విధానం బలహీనపడితే భవిష్యత్తులో ఉన్నత ఇంజనీరింగ్ విద్యకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.

**ప్రభుత్వం చర్చలకు ముందుకు రావాలి**
విద్యార్థుల ఆందోళనలు మరింత ఉధృతం కాకముందే ప్రభుత్వం విద్యా నిపుణులు, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, పూర్వ విద్యార్థులతో ప్రజాస్వామ్యబద్ధంగా చర్చలు జరపాలని ఎరవెల్లి జగన్ డిమాండ్ చేశారు. ఎస్‌బీటెట్‌ను యథావిధిగా కొనసాగిస్తూ, పాలిటెక్నిక్ విద్యకు నిధులు పెంచి మరింత బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్రంలోని వనరులను ఉపయోగించుకుని ప్రభుత్వ రంగంలో చిన్న, కుటీర పరిశ్రమలను విస్తరించి, వాటికి అవసరమైన నైపుణ్యాలను ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో అందించే విధానాన్ని రూపొందించాలని సూచించారు. అలా చేస్తే విద్యార్థులకు నైపుణ్యాలతో పాటు ఉపాధి అవకాశాలు పెరిగి నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. "సాంకేతిక విద్యను పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు దూరం చేసే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోకూడదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా నిపుణులతో చర్చించి పాలిటెక్నిక్ విద్య భవిష్యత్తును కాపాడాలి" అని ఎరవెల్లి జగన్ కోరారు.

# 'మెఫెంటర్‌మైన్ సల్ఫేట్' ఇంజెక్షన్లను కొనుగోలు చేస్తూ, విక్రయిస్తున్న ముఠా అరెస్టు






**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 21 (పీపుల్స్ న్యూస్)**
బాడీ బిల్డింగ్ , తక్షణ కండరాల పెరుగుదల కోసం ఎలాంటి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా అక్రమంగా 'మెఫెంటర్‌మైన్ సల్ఫేట్' ఇంజెక్షన్లను కొనుగోలు చేస్తూ, విక్రయిస్తూ ఉపయోగిస్తున్న ముఠాను హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ (గోల్కొండ జోన్) ,గోషామహల్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ దాడిలో ప్రధాన సరఫరాదారు, ఉప సరఫరాదారుతో పాటు ఇద్దరు వినియోగదారులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ. 1,85,000 విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం..... మంగళ్‌హాట్, రహీంపురా, శివ్‌లాల్ నగర్ కు చెందిన గౌతమ్ సింగ్ (24)నిరుద్యోగి కాగా, అతను జుమ్మేరాత్ బజార్, కుచెందిన ఆర్. అభిలాష్(19) ఇద్దరూ ఒకే జిమ్‌లో స్నేహితులు. అభిలాష్ కండరాల పెంపు కోసం మెఫెంటర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లను వాడేవాడు. అతనిని చూసి గౌతమ్ సింగ్ కూడా వీటిని వాడటం ప్రారంభించాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల గౌతమ్ సింగ్ వీటిని అక్రమంగా విక్రయించి డబ్బు సంపాదించాలని పథకం వేశాడు. వాట్సాప్ ద్వారా ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన ఒక పరిచయం లేని సరఫరాదారుని సంప్రదించి, 'షాడోఫ్యాక్స్ కొరియర్' ద్వారా ఒక్కో వైయల్‌ను రూ. 160కి తెప్పించుకునేవాడు. అనంతరం అభిలాష్ సహాయంతో గోషామహల్ ప్రాంతంలోని కస్టమర్లకు ఒక్కో వైయల్‌ను రూ. 900 చొప్పున అమ్మి అక్రమ లాభాలు గడించేవాడు. ఎంజే బ్రిడ్జ్, భోలక్ష్మి మాత ఆలయం వద్ద బేగంబజార్కుచెందిన సిద్ధేష్ ఆండేకర్ , గోషామహల్కు చెందిన దక్ష్ ఉపాధ్యాయ్లకు ఈ ఇంజెక్షన్లను విక్రయించడానికి ద్విచక్ర వాహనంపై వచ్చిన సమయంలో టాస్క్‌ఫోర్స్ ,గోషామహల్ పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మెఫెంటర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు (టెర్మిన్ - 50 వైయల్స్, ఒక్కొక్కటి రూ. 900 విలువైనవి), బిడియు -40 ఇన్సులిన్ ఇంజెక్షన్లు: 05, ఖాళీ మెఫెంటర్‌మైన్ సల్ఫేట్ వైయల్స్: 05, బర్గ్‌మ్యాన్ ద్విచక్ర వాహనం ( టీఎస్ 13 ఎఫ్బి 5577), మొబైల్ ఫోన్లు: 04 (మొత్తం సొత్తు విలువ: రూ. 1,85,000 లు స్వాధీనం చేసుకున్నారు. యువత త్వరగా కండరాలు పెంచాలనే ఉద్దేశంతో ఈ స్టెరాయిడ్ ఇంజెక్షన్లకు బానిసలై ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఎలాంటి లైసెన్స్ లేదా డాక్టర్ సీలు, సంతకం ఉన్న ప్రిస్క్రిప్షన్ లేకుండా వీటిని విక్రయించడం తీవ్రమైన నేరం. ఈ ఘటనపై గోషామహల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆపరేషన్ హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ (గోల్కొండ జోన్) ఇన్‌స్పెక్టర్ ఎం. మహేష్ పర్యవేక్షణలో, సబ్-ఇన్‌స్పెక్టర్ ఎన్. నవీన్ , గోషామహల్ పోలీస్ సిబ్బందితో కలిసి నిర్వహించారు.

# సిఈఐఆర్ పోర్టల్ ద్వారా 11 పోయిన మొబైల్ ఫోన్లు స్వాధీనం






**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 21 (పీపుల్స్ న్యూస్ ?**
)సిఈఐఆర్ పోర్టల్ ద్వారా 11 పోయిన,మిస్సింగ్ మొబైల్ ఫోన్లను రైన్ బజార్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం హైదరాబాద్ సిటీ, రైన్ బజార్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సిహెచ్. నేతాజీ, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ నయీముద్దీన్, డిఎస్ఐ పి. రాంకిషన్ , క్రైమ్ టీమ్ సంయుక్తంగా "సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్" పోర్టల్ సాంకేతికత సహాయంతో సుమారు 1,00,000 లక్ష రూపాయల విలువైన 11 పోయిన/మిస్సింగ్ మొబైల్ ఫోన్లను విజవంతంగా స్వాధీనం చేసుకున్నారు. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా, వారందరి ఐఎంఈఐ నంబర్లను సిఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ట్రాకింగ్ ద్వారా ఈ ఫోన్లను రికవరీ చేశారు. అనంతరం పోలీస్ అధికారుల సమక్షంలో సదరు ఫోన్లను వాటి అసలు యజమానులకు సురక్షితంగా అందజేశారు. మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు త్వరితగతిన సహాయం అందించడంలో వాటిని ఛేదించడంలో ఆధునిక సాంకేతికతను, సీఈఐఆర్ పోర్టల్‌ను రైన్ బజార్ పోలీసులు సమర్థవంతంగా వినియోగించుకున్నారు. బాధితుల ఫోన్లను ట్రేస్ చేసి తిరిగి అప్పగించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎస్హెచ్ఓ సిహెచ్. నేతాజీ, డిఐ మహమ్మద్ నయీముద్దీన్, డిఎస్ఐ పి. రాంకిషన్ ,. క్రైమ్ టీమ్ సిబ్బంది కృషిని ఉన్నతాధికారులు అభినందించారు.

# తెలంగాణ విద్యార్థులకే ఎంబీబీఎస్ సీట్లు ఇవ్వాలి

- నాలుగేళ్ల స్థానికత నిబంధనతో ఇతర రాష్ట్రాల విద్యార్థులకే లబ్ధి
- జీవో 150ను వెంటనే రద్దు చేయాలి
- రాహుల్ గాంధీకి కవిత ప్రశ్న.. తెలంగాణలో విద్యార్థులపై పోలీసుల అఘాయిత్యాలపై మౌనమెందుకు?






**హైదరాబాద్:ఆగస్టు 21 (పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ స్థానిక విద్యార్థులకే రాష్ట్రంలోని ఎంబీబీఎస్ సీట్లలో ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 150 వల్ల స్థానిక విద్యార్థులకు అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడిందని ఆమె ఆరోపించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నీట్ ర్యాంకులు సాధించిన తెలంగాణ విద్యార్థుల తల్లిదండ్రులు కల్వకుంట్ల కవితను కలిసి తమ సమస్యలను వివరించారు. ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో జీవో 150 కారణంగా ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ప్రయోజనం కలుగుతోందని, తెలంగాణ విద్యార్థులు నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమస్యలను విన్న కవిత మాట్లాడుతూ.. ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు ప్రక్రియ త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**జీవో 150తో 1,500 నుంచి 2,000 సీట్ల వరకు నష్టం?**
9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్లు తెలంగాణలో చదివితే స్థానికత వర్తించేలా తీసుకొచ్చిన నిబంధన వల్ల ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తెలంగాణలో చదువుతున్న విద్యార్థులకు స్థానిక కోటా ప్రయోజనం లభిస్తోందని కవిత పేర్కొన్నారు. దీంతో ప్రతి ఏడాది సుమారు 1,500 నుంచి 2,000 వరకు మెడికల్ సీట్లు ఇతర రాష్ట్రాల విద్యార్థులకు దక్కే పరిస్థితి ఏర్పడుతోందని ఆమె అన్నారు. తాజా వార్తా కథనాల్లోనూ జీవో 150 వల్ల సుమారు 1,600 మెడికల్ సీట్లు ఇతర రాష్ట్రాల విద్యార్థులకు వెళ్లే అవకాశం ఉందని కవిత పేర్కొన్నట్లు వెల్లడైంది. తెలంగాణ బిడ్డల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో స్థానిక విద్యార్థులకే ఎక్కువ ప్రయోజనం కలిగేలా నిబంధనలు ఉండాలని కవిత అన్నారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ పూర్తిగా రద్దు చేయడం సాధ్యం కాకపోతే అనుబంధ నిబంధనలను సవరించి కనీసం ఏడేళ్లు తెలంగాణలో చదివిన విద్యార్థులనే స్థానికులుగా పరిగణించాలని సూచించారు.

**నీట్ విధానంపైనా విమర్శలు**
నీట్ విధానం కారణంగా ఇప్పటికే తెలంగాణ విద్యార్థులు 15 శాతం సీట్లను కోల్పోతున్నారని కవిత పేర్కొన్నారు. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకంగా మెడికల్ బోర్డు ఉండే విధానం ఉంటే స్థానిక విద్యార్థులకు మరింత న్యాయం జరుగుతుందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని ఆమె కోరారు. సీట్ల కేటాయింపు ప్రక్రియకు ముందే ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే తెలంగాణ విద్యార్థులకు మరోసారి నష్టం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. విదేశీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై వెంటనే స్పందించి అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.

**రాహుల్ గాంధీకి కవిత సూటి ప్రశ్న**
తెలంగాణలో విద్యార్థులపై పోలీసుల అఘాయిత్యాలపై మౌనమెందుకు? ఢిల్లీలో విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ప్రశ్నించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన ఘటనలపై ఎందుకు స్పందించడం లేదని కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీని ట్యాగ్ చేస్తూ కవిత ప్రశ్నలు సంధించారు. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల వ్యవహారశైలిని ప్రశ్నిస్తూ విద్యార్థులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన రాహుల్ గాంధీ వైఖరిని స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే తెలంగాణలో విద్యార్థులపై అంతకన్నా తీవ్రంగా పోలీసులు వ్యవహరించిన ఘటనలపై రాహుల్ గాంధీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. "ఢిల్లీలో ఒక న్యాయం.. తెలంగాణలో మరో న్యాయమా?" అంటూ రాహుల్ గాంధీని కవిత నిలదీశారు.

**మహబూబాబాద్ ఘటనపై ప్రశ్నలు**
జీవో నంబర్ 97కు వ్యతిరేకంగా ఈ నెల 19న మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద పాలిటెక్నిక్ విద్యార్థులు శాంతియుతంగా నిర్వహించిన నిరసనను కవిత ప్రస్తావించారు. విద్యార్థులు తమ హక్కుల కోసం నిరసన చేపట్టిన సమయంలో స్థానిక సీఐ ఇద్దరు విద్యార్థుల గొంతు పట్టుకుని వెనక్కి నెట్టినట్లు వచ్చిన ఆరోపణలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని ఆమె ప్రశ్నించారు. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల వ్యవహారాన్ని ఖండించిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న తెలంగాణలో విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై కూడా స్పందించాలని కవిత డిమాండ్ చేశారు. తెలంగాణలో విద్యార్థులను నేరస్తుల మాదిరిగా చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని రాహుల్ గాంధీ ప్రశ్నించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జీవో 150, జీవో 97 వంటి అంశాలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరిగితే వారి తరఫున తమ పోరాటం కొనసాగుతుందని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

# ప్రజల భద్రతే లక్ష్యం.. మల్కాజిగిరి కమిషనరేట్‌లో విస్తృత కమ్యూనిటీ పోలీసింగ్

- విజిబుల్ పోలీసింగ్.. వాహనాల తనిఖీలు
- సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన.. "మీ సురక్ష", "నేను సైతం 2.0" కార్యక్రమాలు



**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో ఆగస్టు 21 (పీపుల్స్ న్యూస్)**
ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి భద్రతను పటిష్టం చేసే లక్ష్యంతో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పోలీసులు విస్తృతంగా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పలు ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచుతూ నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టారు. అదేవిధంగా ప్రజలకు సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. "మీ సురక్ష", "నేను సైతం 2.0" కార్యక్రమాల్లో భాగంగా పోలీసులు ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు, భద్రతకు సంబంధించిన ఇబ్బందులను తెలుసుకున్నారు. ప్రజలు పోలీసులతో స్నేహపూర్వకంగా మెలగాలని, ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజలతో మమేకమై.. నేరాలపై ఉక్కుపాదం.. భద్రతపై నిరంతర అవగాహన లక్ష్యంగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత విస్తృతం చేస్తున్నారు.

# రూ.13 వేల లంచం.. పంచాయతీ కార్యదర్శి అరెస్ట్

- ఇంటి నిర్మాణ అనుమతి, ఇంటి నంబర్ కోసం లంచం డిమాండ్
- రూ.20 వేలు అడిగి.. రూ.13 వేలకు బేరం
- ఫోన్‌పే ద్వారా లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కిన వైనం



**హైదరాబాద్ : క్రైమ్ బ్యూరో ఆగస్టు 21 (పీపుల్స్ న్యూస్)**
అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో మరో ప్రభుత్వ ఉద్యోగి చిక్కారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం లింగాయిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి జె. వరలక్ష్మి రూ.13 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ ఘటన శుక్రవారం (21.08.2026) చోటుచేసుకుంది లింగాయిపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన ఇంటికి నిర్మాణ అనుమతి ఇవ్వడంతో పాటు ఇంటి నంబర్ కేటాయించేందుకు ఫిర్యాదుదారుడి నుంచి పంచాయతీ కార్యదర్శి లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. మొదట రూ.20 వేలు డిమాండ్ చేసిన వరలక్ష్మి.. అనంతరం బేరసారాల తర్వాత రూ.13 వేలకు అంగీకరించినట్లు ఏసీబీ ప్రెస్‌నోట్‌లో పేర్కొంది.

**నగదు కాదు.. ఫోన్‌పే ద్వారా లంచం**
ఏసీబీ అధికారులు ట్రాప్ ఏర్పాటు చేసిన సమయంలో వరలక్ష్మి నగదు రూపంలో లంచం తీసుకోకుండా ఫోన్‌పే ద్వారా రూ.13 వేలు బదిలీ చేయాలని ఫిర్యాదుదారుడికి సూచించినట్లు అధికారులు తెలిపారు. అందుకోసం మరో పంచాయతీ కార్యదర్శి లావణ్యకు చెందిన ఫోన్‌పే నంబర్‌ను ఆమె ఫిర్యాదుదారుడికి ఇచ్చినట్లు ఏసీబీ వెల్లడించింది. వరలక్ష్మి సూచన మేరకు ఫిర్యాదుదారుడు రూ.13 వేలను ఆ ఫోన్‌పే ఖాతాకు బదిలీ చేయడంతో లంచం స్వీకరణ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. లంచం డిమాండ్ చేయడం, ఫోన్‌పే ద్వారా డబ్బులు బదిలీ చేయాలని సూచించడం వంటి అంశాలకు సంబంధించిన ఆధారాలను ఏసీబీ అధికారులు నమోదు చేసినట్లు ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు.

**అరెస్ట్.. కోర్టులో హాజరు**
ప్రభుత్వ ఉద్యోగిగా తన అధికారిక హోదాను దుర్వినియోగం చేసి అనుచిత ప్రయోజనం పొందేందుకు లంచం డిమాండ్ చేసి స్వీకరించినట్లు ఏసీబీ పేర్కొంది. వరలక్ష్మిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసిన అధికారులు కరీంనగర్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఫిర్యాదుదారుడి భద్రత దృష్ట్యా ఆయన వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించలేదు.

**లంచం అడిగితే 1064కు ఫిర్యాదు**
ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. లంచం డిమాండ్‌కు సంబంధించిన సమాచారాన్ని ఏసీబీకి అందిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏసీబీ సందేశం: ప్రభుత్వ సేవల కోసం లంచం ఇవ్వాల్సిన అవసరం లేదు.. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీని సంప్రదించాలి.

# హుస్సేన్‌సాగర్‌లో ఆకట్టుకుంటున్న లేజర్ షో - 'కోహినూర్' వజ్రం చరిత్ర కళ్లకు కట్టేలా ప్రదర్శన



**హైదరాబాద్ :** రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యపు చీకటి రోజులను చరిత్ర ఎప్పటికీ మర్చిపోదు. అందులో కోహినూర్ వజ్రం ఎంతో కీలకం. భరత నేలపై పుట్టి చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన ఆ వజ్రాన్ని తెల్లదొరలు ఎత్తుకెళ్లిన కథలు ఎన్నో విన్నాం. బ్రిటిష్ సంకెళ్లు తెంచుకొని ప్రజాస్వామ్యంలోకి అడుగు పెట్టినా కోహినూర్ కీర్తి ఎన్నటికీ తగ్గదు. ఆ చరిత్ర ఎప్పుడు విన్నా ప్రతి భారతీయుడి రక్తం మరుగుతుంది. మరి ఆ వైభవాన్ని కళ్లారా చూస్తే కచ్చితంగా రోమాలు నిక్కబొడుచుకుంటాయి. అలాంటి అనుభూతి పొందాలంటే హుస్సేన్ సాగర్ వద్ద సంజీవయ్య పార్క్‌లో ఏర్పాటు చేసిన కోహినూర్ మల్టీమీడియా లేజర్ షోకు వెళ్లాల్సిందే. ఆ లేజర్ షో విశేషాలెంటో మనమూ చూద్దాం. రూ.49 కోట్ల వ్యయంతో లేజర్?షో : దేశ చరిత్రలో కోహినూర్ వజ్రానిది ప్రత్యేక స్థానం. భరతనేలపై పుట్టి ఎందరో రాజుల చేతులు మారి ఎన్నో యుద్ధాలను కళ్లారా చూసింది. కాకతీయుల కాలం నుంచి స్వాతంత్ర్య ఉద్యమం వరకు కోహినూర్ వజ్రం ఓ వెలుగు వెలిగింది. ఆ చరిత్రను నేటి తరానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో టూరిజం శాఖ వినూత్న ఆలోచన చేసింది. హుస్సేన్‌సాగర్ వద్ద సంజీవయ్య పార్క్‌లో రూ.49 కోట్ల వ్యయంతో లేజర్ షోను ఏర్పాటు చేసింది. కోహినూర్‌నే ఓ అమ్మాయిగా పరిచయం చేస్తూ తన కథను తనే చెప్పుకునేలా వాటర్ స్క్రీన్ తో కూడిన లేజర్ షోను నిర్వాహకులు రూపొందించారు. కథలు, పాటలు, సంగీతం నీటిపై రంగురంగుల లేజర్ కాంతులు, చారిత్రక చిత్రాలతో షోను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ప్రముఖ సింగర్ సునీత కోహినూర్ కథకు వాయిస్ ఓవర్ అందించారు. మట్టి నుంచి కోహినూర్ ఎలా పుట్టిందనే కథతో షో మొదలవుతుంది. కాకతీయుల కాలంలో భద్రకాళి అమ్మవారి మూడో నేత్రంగా కోహినూర్‌ను అలంకరించిన విధానం ఆ కాలంలో ఏం జరిగిందనే విషయాలతో లేజర్ షో కొనసాగుతుంటుంది. చూపరులను ఆకట్టుకుంటున్న లేజర్? షో : కాకతీయ రాజ్యంపై మాలిక్ కాఫర్ దండయాత్ర యుద్ధ సన్నివేశాలు కోహినూర్ చేతులు మారిన ఘటనలను లేజర్ ప్రొజెక్షన్‌లో చూపించారు. శతాబ్దాల తర్వాత కోహినూర్ బాబర్ చేతుల్లోకి చేరడం, తర్వాత షాజహాన్ నెమలి సింహాసనంలో వజ్రం అలంకరించటం, తాజ్?మహల్ చిత్రాలను వాటర్ స్క్రీన్?లో చూపించారు. కోహినూర్ వజ్రం నాదిర్ షా ఆధీనంలోకి వెళ్లి చివరకు బ్రిటిష్ పాలకుల చేతుల్లోకి వెళ్లింది. తర్వాత బ్రిటిష్ రాణి విక్టోరియాకు బహూకరించిన ఘట్టాలను కూడా కళ్లకు కట్టినట్లు చూపించారు. ఝాన్సీ లక్ష్మీబాయి చరిత్ర, స్వాతంత్ర్యానికి ముందు ఆ తర్వాత సందర్భాలతో కోహినూర్ చరిత్రను అనుసంధానిస్తూ లేజర్ షో అద్భుతంగా ప్రదర్శించారు. ?లేజర్ షోలో తెలంగాణ సాయుధ పోరాటం, ఆపరేషన్ పోలో ఘట్టాలను సైతం ప్రదర్శించారు. ప్రత్యేకంగా తెలంగాణ సంప్రదాయాలు, కళలు చూపరులను ఆకట్టుకున్నాయి.

# మార్గదర్శి వ్యవహారంలో అంతిమంగా ధర్మమే గెలిచింది

**హైదరాబాద్** మార్గదర్శి ఫైనాన్షియర్స్ అంశంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు నిజాయతీకి దక్కిన మహోన్నత విజయమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. 'మార్గదర్శి వ్యవహారంలో సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన చరిత్రాత్మక తీర్పు నిజాయతీకి దక్కినటువంటి మహోన్నత విజయం. రామోజీరావు హిమాలయమంత ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ఆ నిందారోపణలను ఎదుర్కొని సుదీర్ఘ న్యాయ పోరాటం చేశారు. అంతిమంగా ధర్మమే గెలిచింది' అని ఎక్స్?లో వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. సుప్రీంతీర్పుపై పలువురు చందాదారులు హర్షం : మార్గదర్శి డిపాజిటర్ల విశ్వాసం అప్పటికీ ఇప్పటికీ ఇసుమంతైనా చెక్కు చెదరలేదు. నాటి పాలకులు మార్గదర్శిని వేధించినా రామోజీరావుపై నమ్మకంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ సొమ్ము దాచుకున్న వారు క్యూలు కట్టలేదు. ఒకవైపు ప్రభుత్వం డిపాజిటర్లను రెచ్చగొట్టినా ఫిర్యాదు చేసేందుకు ఒక్కరూ ముందుకు రాలేదు. నాటి పాలకులు ఎంత ఒత్తిడి తెచ్చినా అప్పటి తమ నమ్మకమే సుప్రీంకోర్టు తీర్పుతో నిజమైందని చందాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్గదర్శి డిపాజిటర్ల నమ్మకం ఏళ్లు గడిచినా చెక్కు చెదరలేదు. అప్పటి పాలకులు తమ చేతిలో చందాదారులు విజ్ఞత ప్రదర్శించారు. రెచ్చగొట్టినా సంయమనం చూపారు. మార్గదర్శిపై ఫిర్యాదు చేయాలని ఎంత ఒత్తిడి చేసినా సంస్థపై వారికున్న అపార విశ్వాసం ముందు అవన్నీ దిగదిడుపే అయ్యాయి. చివరకు వారందరి నమ్మకమే గెలిచింది. సుప్రీంకోర్టు తీర్పుతో డిపాజిటర్లలో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికీ రూ.5.23 కోట్లు ఎస్క్రో ఖాతాలోనే ఉన్నాయంటే ఆ సంస్థపై విశ్వాసమేనని ఖాతాదారులు అభిప్రాయపడ్డారు. మార్గదర్శిని నమ్ముకొని ఆర్థికంగా నిలదొక్కుకున్నామని, తమ జీవితంలో ప్రతీ ముఖ్యమైన విషయంలోనూ మార్గదర్శి తోడ్పాటు ఉందన్నారు. 'మార్గదర్శితో మా అనుబంధం తల్లిదండ్రుల నుంచి వచ్చింది. అవసరమైన ప్రతిసారి మార్గదర్శి మాకు తోడుగా ఉంది. కాయలున్న చెట్టుకే రాళ్ల దెబ్బలు తప్పవన్నట్లు నిజాయతీతో పనిచేసే మార్గదర్శి సంస్థకు నిందలు తప్పలేదు.

శనివారం,
ఆగస్టు 22, 2026
హైదరాబాద్
పీపుల్స్ న్యూస్
దినపత్రిక


# తిరుమల శ్రీవారికి జీవితాన్నే అంకితం చేసిన భక్తురాలు తరిగొండ వెంగమాంబ వర్ధంతి విశేషాలు ఇవే!





శ్రీ వేంకటేశ్వరుని చరణ సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన భక్త శిరోమణి తరిగొండ వెంగమాంబ! అన్నమయ్య చూపిన బాటలో కోనేటిరాయుని సంకీర్తనార్చన చేసి తరించిన వెంగమాంబ శ్రీనివాసునిలో ఐక్యమైన పుణ్యదినం శ్రావణ శుద్ధ నవమి! యేటా తిరుమలలో వెంగమాంబ వర్ధంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఆగస్టు 21, శుక్రవారం రోజున తరిగొండ వెంగమాంబ వర్ధంతి సందర్భంగా ఆమె జీవిత విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

**బాల్యంలోనే భక్తి బీజం**

చిత్తూరు జిల్లా వాయల్పాడు సమీపాన ఉన్న తరిగొండ గ్రామంలో జన్మించిన వెంగమాంబకు చిన్న వయసులోనే నరసింహ స్వామి పట్ల భక్తి భావం నాటుకుంది. అలా ఆమె నరసింహ స్వామి భక్తురాలైంది. ముక్కు పచ్చలారని పసి వయసులోనే వివాహం కావడం, అనంతరం వైధవ్యం ప్రాప్తించడంతో ప్రాపంచిక విషయాలపై వైరాగ్యం కలిగి భక్తి మార్గాన్ని ఎంచుకుంది. ఆధ్యాత్మిక సాధనాలతో విశిష్ట యోగినిగా మారింది.

**సుమంగళి లక్షణాలతో**

వెంగమాంబ చిన్న వయసు నుంచి వేంకటేశ్వర స్వామిని తన భర్తగా భావిస్తుండేది. ఆమె ఇష్టానికి విరుద్ధంగా జరిగిన వివాహం ఆమెపై ఎలాంటి ప్రభావం చూపలేదు. అందుకే బాల్యంలోనే వితంతువు అయినప్పటికీ వేంకటేశ్వరుడి తన భర్త అని భావిస్తూ పసుపు కుంకుమలతో సకల శుభ లక్షణాలతోనే ఉండేది. ఆమె చర్యలు సమాజం హర్షించలేదు. అయినప్పటికీ ఆమె అన్నింటికీ అతీతంగా భక్తి సామ్రాజ్యంలో తరిస్తూ ఉండేది.

**తిరుమలకు ప్రయాణం**

స్వగ్రామంలో ఎదురవుతున్న అవమానాలు తట్టుకోలేక అరణ్య మార్గంలో ప్రయాణం చేసి తిరుమల చేరుకుంది. ఆనంద నిలయంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని దర్శించి పరవశించి పోయింది. ఆ తన్మయత్వంతోనే 'వేంకటాచల మహత్యం' రచించింది. నిరంతరం స్వామిసేవ, భక్తి రచనలతో కాలక్షేపం చేస్తున్న ఆమెకు హథీరాంజీ మఠం వారు తిరుమలలోనే శ్రీవారి ఆలయానికి సమీపంలో శాశ్వత నివాసం ఏర్పాటు చేశారు. అక్కడ ఆమె అనేక పూల మొక్కలు పెంచింది. ప్రతిరోజు ఆ వనంలో పూసిన పూలతో, తులసి దళాలతో కట్టి శ్రీనివాసునికి సమర్పించేది.

**ఏకాంత సేవ**

వెంగమాంబ తిరుమల వచ్చినప్పటి నుంచి ప్రతిరోజు శ్రీవారి ఏకాంతసేవ సమయంలో ఆనంద నిలయానికి వెళ్లేది. తానే స్వయంగా శ్రీనివాసునికి కర్పూర హారతి ఇచ్చేది. ఈ హారతిని ముత్యాల హారతి అని, తరిగొండ వారి హారతి అని అంటారు. ఈ హారతి శ్రీవారి ఆలయంలో నేటికీ కొనసాగడం విశేషం.

తాళ్లపాక వారి లాలి, తరిగొండ వారి హారతి తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రతిరోజు ఏకాంతసేవ సందర్భంగా అన్నమయ్య వంశీయులు గానం చేసే లాలిపాట, తరిగొండ వెంగమాంబ ప్రారంభించిన ముత్యాల హారతి ఇచ్చిన తర్వాతనే ఆనంద నిలయం బంగారు వాకిళ్లు మూస్తారు. అందుకే 'తాళ్లపాక వారి లాలి, తరిగొండ వారి హారతి' అనే నానుడి ఏర్పడింది

**జీవసమాధి**

తన జీవితాంతం శ్రీ వేంకటేశ్వరుని ఆరాధించిన తరిగొండ వెంగమాంబ చివరకు సా.శ.1817 ఈశ్వర సంవత్సరం శ్రావణ శుద్ధ నవమి నాడు శ్రీ వేంకటేశ్వరస్వామిని స్మరిస్తూ సజీవ సమాధి చెందింది. తిరుమలలో ఉత్తర మాడ వీధిలో, ఉత్తర దిశలో ఉన్న వనంలో ఉన్న ఒక పాఠశాలలో ఇప్పటికి తరిగొండ వెంగమాంబ సమాధిని దర్శించుకోవచ్చు.

**టీటీడీ ఉత్సవాలు**

తరిగొండ వెంగమాంబ వర్ధంతి ఉత్సవాలను పురస్కరించుకుని టీటీడీ అధికారులు తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా నిర్వహిస్తారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలుత శ్రీవారు, తరిగొండ వెంగమాంబ చిత్రపటాలకు పూజలు నిర్వహిస్తారు. అనంతరం తరిగొండ వెంగమాంబ రచించిన సాహిత్యంపై సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు.

**అన్నదానం**

భక్తి మార్గంలో పయనించి శ్రీ వేంకటేశ్వరుని సేవకు జీవితాన్ని అంకితం చేసి చివరకు సజీవ సమాధి చెందిన తరిగొండ వెంగమాంబ జ్ఞాపకార్థం టీటీడీ అధికారులు ఆమె పేరిట నిత్యాన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేసారు. ప్రతి రోజు వేలాదిమంది ఈ అన్నదాన సత్రంలో భోజనం చేస్తుంటారు. భగవంతుణ్ణి చేరాలంటే నిర్మలమైన భక్తి ఒక్కటే మార్గమని నిరూపించిన వెంగమాంబను ఆమె వర్ధంతి రోజు స్మరించుకుందాం.

ఓం నమో వేంకటేశాయ!

# అందానికి బాదం నూనె - ఇలా వాడితే జుట్టు సమస్యలూ తగ్గుతాయట!



బాదం పప్పు ఆరోగ్యానికి మంచిదని అందరికీ తెలిసిందే. అయితే, బాదం నూనెలోనూ అందానికి మేలు చేసే సహజ గుణాలెన్నో ఉన్నాయంటున్నారు నిపుణులు. ఇందులోని విటమిన్లు, ఖనిజాలు వివిధ చర్మ సమస్యల్ని దూరం చేస్తాయని చెబుతున్నారు. ఈ క్రమంలో బాదం నూనెతో సౌందర్యపరంగా చేకూరే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

కుదుళ్లకు మసాజ్?గా : జుట్టు చివర్లు చిట్లడం, పొడిబారడం వంటి సమస్యలు చాలామందిని ఇబ్బంది పెడుతుంటాయి. ఇలాంటప్పుడు బాదం, ఆలివ్, ఆముదం నూనెల్ని సమపాళ్లలో తీసుకొని కలుపుకోవాలంటున్నారు నిపుణులు. ఈ మిశ్రమంతో కుదుళ్లను మర్దనా చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇలా వారంలో కనీసం రెండుసార్లు చేస్తే జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా పెరుగుతుందని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో స్నానం చేయడానికి ముందు శరీరానికి బాదం నూనె రాసుకొని బాగా మర్దనా చేసుకోవాలంటున్నారు. తద్వారా ఇందులోని పోషకాలు చర్మంలోని ఇంకి శరీం —నికి మెరుపును, తేమను అందిస్తాయని తెలియజేఎ అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయట. ఇవి అతినీలలోహిత కిరణాల నుంచి జుట్టుకు రక్షణ కల్పిస్తాయని చీఫ్ఆశీఋశ్రీ ాఆఎతీఋతీఎ శీట వీవఎఅఎఆఅవ పేర్కొంది. క్యూటికల్ కణాల మధ్య అంతరాన్ని పూరించడం వల్ల జుట్టు స్థితిస్థాపకత పెరుగుతుందని తెలిపింది.

తీవ్రమైన 'ఒత్తిడి' ఎదుర్కొంటున్నారా? - 4 ా'ం రూల్?తో చెక్ పెట్టొచ్చంటున్న నిపుణులు!డార్క్? సర్కిల్స్ : చాలా మందిని కళ్ల కింద డార్క్ సర్కిల్స్ ఇబ్బంది పెడుతుంటాయి. ఇలాంటి వారు రాత్రి పడుకునే ముందు కొన్ని చుక్కల బాదం నూనెను కళ్ల కింద అప్లై చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల సమస్య తగ్గే అవకాశం ఉందని అంటున్నారు.

చర్మ సమస్యలకు : బాదం నూనెలో ఎమోలియెంట్, స్క్లెరోసెంట్ లక్షణాలు ఉన్నాయట. ఇవి చర్మాన్ని మృదువుగా చేయడంతోపాటు చర్మపు రంగును మెరుగ ుపరుస్తాయని జుబతీశీజూవ ్రావీజ పేర్కొంది. అంతే కాకుండా సోరియాసిస్, తామర వంటి పొడి చర్మ పరిస్థితులకు చికిత్స చేయడానికి బాదం నూనెను ఉపయోగించేవారని తెలిపింది. ఇంకా, శస్త్రచికిత్స తర్వాత వచ్చే మచ్చలను బాదం నూనె తగ్గిస్తుందని వెల్లడించింది.

యాంటీ ఏజింగ్? : చిన్న వయసులో వృద్ధాప్య ఛాయలతో ఇబ్బంది పడుతున్న వారికి బాదం నూనె మేలు చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇందులోని పోషకాలు యాంటీ ఏజింగ్ కారకాలుగా పనిచేస్తాయంటున్నారు. దీన్ని తరచూ చర్మానికి రాసుకోవడం వల్ల ముడతలు తగ్గుముఖం పడతాయని తెలియజేస్తున్నారు.

చర్మానికి నలుగులా పెట్టుకుంటే మృతకణాలు తొలగిపోతాయని తెలియజేస్తున్నారు. దీంతో చర్మం తాజాగా మారుతుందట.మీకు అందించిన సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# శివలింగంపై నాలుగు ముఖాలతో బ్రహ్మదేవుడు- ఈ అరుదైన ఆలయం ఎక్కడుందో తెలుసా?

త్రిమూర్తుల్లో శివకేశవులకు అనేక ఆలయాలు ఉన్నప్పటికీ బ్రహ్మదేవునికి మాత్రం భూలోకంలో ఆలయాలు అరుదుగా ఉంటాయి. సృష్టికర్త బ్రహ్మదేవునికి ఎక్కడా ఆలయం లేకపోవడం చెప్పుకోవాల్సిన విషయం. విధాతకు పూజార్హత లేకపోవడానికి సంబంధించి కొన్ని గాధలు వినిపిస్తాయి. అసత్యమాడినందుకు కైలాసనాధుడు ఇచ్చిన శాపం ఒక కారణంగా చెబుతారు. మరో గాథ ప్రకారం త్రిమూర్తుల్లో ఎవరు గొప్పవారు అనే విషయాన్ని కనుగొనడానికి మహర్షుల కోరిక మీద సత్య లోకానికి వెళ్లిన భృగు మహర్షి తనను పట్టించుకోని కమలాసనునికి భూలోకంలో పూజలు ఉండవని శపించారని తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికి అరుదుగా కనిపించే బ్రహ్మదేవుని ఆలయాల్లో ఒకటి మన తెలుగు రాష్ట్రంలో కూడా ఉండడం విశేషం. ఈ ఆలయ విశేషాలేంటో ఈ కథనంలో తెలుసుకుందాం.

శ్రీ చతుర్ముఖ బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయం గుంటూరు జిల్లా చేబ్రోలులో ఉన్న శ్రీ చతుర్ముఖ బ్రహ్మ లింగేశ్వర స్వామి దేవాలయం భారతదేశం మొత్తంలో బ్రహ్మ దేవుడికి ఉన్న అతి తక్కువ దేవాలయాల్లో ఒకటి. బ్రహ్మదేవునికి పూజార్హత ఉండదనే శాపాన్ని గౌరవిస్తూనే, బ్రహ్మ దేవుడికి కూడా పూజలు జరగాలనే ఉద్దేశ్యంతో చేబ్రోలులోని ఈ గుడిలో ఒక అద్భుతం చేశారు. ఇక్కడ బ్రహ్మ దేవుడికి విడిగా విగ్రహం ఉండదు. దానికి బదులుగా, గర్భగుడిలోని శివలింగం చుట్టూ బ్రహ్మ దేవుడి నాలుగు ముఖాలు అద్భుతంగా చెక్కి ఉంటాయి. అంటే శివుడికి చేసే పూజ ద్వారా బ్రహ్మ దేవుడిని కూడా ఇక్కడ కొలుస్తారన్నమాట. ఈ బ్రహ్మ ఆలయం పద్దెనిమిదో శతాబ్దకాలంలో నిర్మించినట్లుగా తెలుస్తోంది. అయితే ఈ ఆలయాన్ని ఎవరు? ఎందుకు? ఎప్పుడు నిర్మించారు? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**చేబ్రోలు చరిత్ర**

శ్రీ చతుర్ముఖ బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయ చరిత్ర తెలుసుకునే ముందు అతి ప్రాచీనమైన చేబ్రోలు చరిత్ర గురించి కూడా కొంత పరిశీలిద్దాం. కావడానికి చిన్న గ్రామమే అయినప్పటికీ చేబ్రోలుకు అతి ప్రాచీనమైన చరిత్ర ఉంది. ఒకప్పుడు లోహ పరిశ్రమకు ప్రసిద్ధికెక్కి "తామ్ర పురి"గా పిలిచిన చేబ్రోలులో జైన, బౌద్ధ, హిందూ మతాలు ఒకదాని తరువాత ఒకటి వెల్లి విరిసినట్లుగా చెబుతారు. ఇక్కడ జరిపిన తవ్వకాల్లో లభించిన శతాబ్దాల పూర్వపు జైన, బౌద్ధ, హిందూ నిర్మాణాల అవశేషాలు, నాటి పత్రాలు, శాసనాలు దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.



**ఆలయాల గ్రామం**

క్రీస్తుశకం తొలి శతాబ్దం నుంచి ఇక్కడ హిందూ ఆలయాల నిర్మాణాలు వివిధ రాజ వంశాల కాలంలో జరిగినట్లు అనేక శాసనాల ద్వారా తెలుస్తోంది. ఒకప్పుడు ఇక్కడ నూరుకు పైగా ఆలయాలు ఉండేవని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కొన్ని ఆలయాలు మాత్రమే ఉన్నాయి. వాటిల్లో ముఖ్యమైనవి శ్రీ నాగేశ్వర స్వామి, శ్రీ భీమేశ్వర స్వామి, శ్రీ వీరభద్ర స్వామి, శ్రీ ఆది కేశవ స్వామి ఆలయాలు. వాటితో పాటు శ్రీ చతుర్ముఖ బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయం కూడా ఒకటి. ఒకే క్షేత్రంలో త్రిమూర్తులు కొలువై ఉండటం అత్యంత అరుదైన విశేషం. అలాంటి అద్భుతాన్ని ఒక్క చేబ్రోలులోనే చూడగలం.

**శ్రీ రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు**

నిజాం, ఆంగ్లేయులకు సామంతునిగా పనిచేసిన వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు ఈ ఆలయ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఒకానొక సమయంలో దోపిడీ దొంగలను నిలువరించడానికి చేసిన ప్రయత్నంలో భాగంగా నాయుడు గారు కొందరు దొంగలను హతమార్చడం జరిగింది. ఈ హత్య దోషం నుంచి పరిహారం కోసం వేదపండితుల సలహా మేరకు ఆయన ఈ ఆలయాన్ని నిర్మించినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

**ఆలయ విశేషాలు**

శ్రీ చతుర్ముఖ బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయం నలుచదరంగా ఉన్న కోనేరు మధ్యలో ప్రశాంతమైన వాతావరణంలో ఉంటుంది. సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన మండపం లాగా కనిపించే ఈ ఆలయానికి నలుపక్కలా స్తంభాలు ఉంటాయి. మధ్యలో ఉన్న సన్నిధికి నాలుగు ద్వారాలు, సుందరంగా రాతి మీద చెక్కిన కిటికీలు ఉంటాయి. ఎత్తైన పానవట్టం మీద పద్మ పీఠం ఉంటుంది. పద్మసంభవుడైన బ్రహ్మ ఇక్కడే కొలువై ఉంటాడు. అయితే ఆశ్చర్యం ఏమిటంటే పద్మాసనానికి కేంద్రంలో కనిపించే చతురస్రాకారపు శివలింగం పైన వరద ముద్రల్లో ఉపస్థిత భంగిమలో చతుర్ముఖ బ్రహ రూపాన్ని చెక్కి ఉండడం విశేషం.

**అష్ట ఆలయాలు**

అలాగే ఆలయ ప్రాంగణంలో అష్టదిక్కులను దిగ్బంధించడానికి 8 ఆలయాలు నిర్మించి ఉన్నాయి. అయితే వీటిల్లో కొన్ని శిథిలమైనప్పటికీ ప్రస్తుతం ఆగ్నేయంలో శ్రీ పార్వతీ దేవి, తూర్పున శ్రీ చంద్రశేఖర స్వామి, ఈశాన్యంలో శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారు, ఉత్తరంలో శ్రీ వేణుగోపాల స్వామి, పడమర శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి, దక్షిణంలో శ్రీ రంగనాథ స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి.

**రెండు ప్రత్యేకతలు**

ఈ క్షేత్రంలో ప్రధానంగా రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. అవేంటంటే, దరిదాపుగా అధికశాతం శివలింగాలు బ్రహ్మసూత్రం కలిగి ఉండటం, నంది విగ్రహాలు కుడి కాలికి బదులు ఎడమ కాలిని పైకి ఎత్తి ఉండటం ప్రత్యేకం. నిత్య పూజలు జరిగే ఈ ఆలయాలు వారాంతపు రోజుల్లో, పర్వదినాల్లో యాత్రీకులతో, స్థానిక భక్తులతో సందడిగా ఉంటాయి. మన రాష్ట్రంలో త్రిమూర్తులను ఒకే క్షేత్రంలో దర్శించుకునే అపూర్వ అవకాశం ఇక్కడ మాత్రమే ఉంటుంది.

**ఎలా చేరుకోవాలి?**

గుంటూరు నుంచి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న చేబ్రోలుకు బస్సులు, ప్రైవేటు వాహనాల్లో సులభంగా చేరుకోవచ్చు. ఈ విశిష్టమైన ఆలయాన్ని మనం కూడా దర్శించి త్రిమూర్తుల అనుగ్రహాన్ని పొందుదాం.

ఓం నమః శివాయ.ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ

# టీనేజర్ల ఆలోచనలను పేరెంట్స్ - తల్లిదండ్రుల ప్రేమను పిల్లలు అర్థం చేసుకుంటే అన్నీ హ్యాపీడేసే!



టీనేజీలో ఉన్న పిల్లలు .. రెక్కలు తొడుక్కున్న పక్షుల్లా, రంగు రంగుల సీతాకోక చిలుకల్లా స్వేచ్ఛగా తమ లోకంలో విహరించాలనుకుంటున్నారు. దీంతో నిన్నటి వరకూ తమ చాటున పెరిగిన వాళ్ల వ్యవహారశైలి తల్లిదండ్రులకు ఓ పట్టాన మింగుడుపడదు. అలాగని తప్పంతా ఒకరిదే అనుకోవద్దంటున్నారు నిపుణులు. మరి, ఈ సమస్యకు పరిష్కారం తెలియాలంటే ఇరువర్గాలూ అర్థం చేసుకోవాల్సిన కొన్ని విషయాలు ఉన్నాయని చెబుతున్నారు. మరి,అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!పేరెంట్స్ గమనించండి :వాదించకండి : పిల్లల్ని దారికి తెచ్చుకోవడానికి మొండితనం వద్దంటున్నారు నిపుణులు. వాదనలకు అసలే దిగొద్దట. వాళ్లేం చెబుతున్నారో వినడానికి మీరు సిద్ధంగా ఉండాలని చెబుతున్నారు. ఏదైనా విషయాన్ని ముక్కు సూటిగా కుదరదంటే కుదరదని చెప్పవద్దని సూచిస్తున్నారు. ఒకవేళ మీకు ఇష్టం లేకపోతే కొన్నాళ్లు వాయిదా వేయామని చెప్పాలట. అవసరమైతే కొన్ని షరతులతో ఒప్పుకోమని సలహా ఇస్తున్నారు. ఒప్పుకొంటే అందుకు వారిపై ఉన్న ప్రేమే కారణమని వారికి అర్థమయ్యే విధంగా వ్యవహరించాలట.

బలవంతంగా వద్దు : పిల్లలతో ఏదైనా పనిని బలవంతంగా చేయించాలనుకునే కొద్దీ మరింతగా ప్రతిఘటిస్తారట. అలాగని వదిలేయమని కాదు. నెమ్మదిగా నచ్చజెప్పామంటున్నారు నిపుణులు. ఎందుకు ఇష్టపడటం లేదో తెలుసుకోమని చెబుతున్నారు. ఆ పనిలో అలవాటు పడే వరకూ మీరు తోడుగా ఉండమని సలహా ఇస్తున్నారు. ఎక్కడైనా తగ్గాల్సి వస్తే మీరే ముందుకు రావాలని పేర్కొంటున్నారు. అలాగైనా మీకు వారిపై ఉన్న ప్రేమని అర్థం చేసుకుంటారట.

వయస్సు పెరిగే కొద్ది వేధించే చర్మ సమస్యలు – ఇలా చేస్తే సహజంగా తగ్గించుకోవచ్చట!

ప్రత్యామ్నాయాలు ఇవ్వండి : ఎదిగే పిల్లలు, అభిప్రాయాలు, తెలుసుకోవాలంటున్నారు నిపుణులు. అలా కాకుండా ప్రతి పనిలోనూ ఇలా చేయి, అలా చేయి అని చెబుతుంటే అయిష్టత పెంచుకుంటారని హెచ్చరిస్తున్నారు. ఆ పనులు చేయకుండా ఉండేందుకు ప్రయత్నించడం లేదా వాళ్లకి నచ్చినట్లు చేయడం లాంటివి చేస్తారని తెలియజేస్తున్నారు. అందుకే, ప్రతి పనికీ కొన్ని ప్రత్యామ్నాయాలు ఇస్తే సరిపోతుందని సూచిస్తున్నారు. వారికి ఆప్షన్ ఇచ్చినట్లూ ఉంటుందని సలహా ఇస్తున్నారు. దీంతో మీరు కోరుకున్నదీ జరుగుతుందట.అజమాయిషీ వద్దు : అజమాయిషీ చేయడం వల్ల తమ ఆలోచనలకి, ఇష్టాయిష్టాలకు మీరు అడ్డుపడుతున్నారని పిల్లలు భ్రమపడే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. అలా కాకుండా, ఓ ఫ్రెండ్?గా వారితో గడపాలని సూచిస్తున్నారు. అప్పుడే, మనసు విప్పి మాట్లాడతారని తెలియజేస్తున్నారు. ఏదైనా వారికి అదే పనిగా ఉపన్యాసంలా కాకుండా సలహాలు, సూచనలు ఇస్తున్నట్లే ఏ విషయమైనా చెప్పాలని సలహా ఇస్తున్నారు. ఇంట్లో పనులు లేదా ఉద్యోగం రీత్యా మీరు టైం లేకున్నా.. రోజులో కొంత సమయం వాళ్లకు కేటాయించామంటున్నారు. ఇది మీ మధ్య బంధాన్ని బలపరుస్తుందని వివరిస్తున్నారు. పిల్లలూ ఆలోచించండి :ఆ ఉద్దేశం తెలుసుకోండి : పేరెంట్స్ అనుభవంతో చెబుతారు. సలహాలు ఇవ్వడం, ఆంక్షలు పెట్టడం వెనుక ఉద్దేశం మీ సంక్షేమమే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే, వాళ్లేం చెబుతున్నారో ఓ సారి వినాలంటున్నారు. వారి బాధ, ఆందోళనల్ని అర్థం చేసుకోమని పేర్కొంటున్నారు. ఆ తర్వాత వాళ్లకు ఏం చెప్పాలి? ఎలాంటి భరోసా ఇవ్వాలనేది మీకే తెలుస్తుందని వివరిస్తున్నారు.ఉక్రోషం వద్దు : అనుకున్నది సాధించాలనే పంతం ఉండటం మంచిదే. కానీ, ఈ ఉక్రోషం కాస్తా కోపంగా మారితే.. మాటలే తూటాలవుతాయంటున్నారు నిపుణులు. ఆ ఒత్తిడిలో ఎదుటివారు నొచ్చుకునేలా దూసుకెళ్తాయని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదిరించడం, వాదించడం వల్ల సమస్య మరింత పెద్దది అవుతుందని పేర్కొంటున్నారు. మీరు చెప్పాలనుకున్న విషయం ఏదైనా శాంతంగా చెప్పామని సూచిస్తున్నారు. మీరు కోరింది ఏదైనా ఇప్పుడే కావాలని తెలియజేస్తున్నారు. ఈ రోజే చేయాలని అనొద్దట. వారికి ఆలోచించుకునే అవకాశం ఇవ్వాలని చెబుతున్నారు. మీరు టైం తీసుకోమంటున్నారు. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పితే.. కచ్చితంగా మిమ్మల్ని అర్థం చేసుకుంటారట.స్పష్టంగా చెప్పండి : మీ మనసులో వంద కోరికలు, ఆలోచనలు ఉండొచ్చు. వాటిని లోపలే ఉంచుకుని బయటికి మాత్రం వేరే విషయాలపై గొడవపడటం వల్ల ఉపయోగం ఉండదంటున్నారు నిపుణులు. మీరేం అనుకుంటున్నారో వారితో ధైర్యంగా చెప్పామని చెబుతున్నారు. అంతేకాదు, ఆ పని చేయడం వల్ల మీ హద్దుల్ని మరిచిపోననే విషయంలో వారికి భరోసా ఇవ్వమంటున్నారు. అప్పుడు వాళ్లూ మిమ్మల్ని నమ్ముతారని వివరిస్తున్నారు.రాజీ పడాల్సిందే : పేరెంట్స్, టీనేజర్లు ఇద్దరూ కొన్నిసార్లు రాజీ పడాలంటున్నారు నిపుణులు. ఎలాగంటే, ఫ్రెండ్స్?తో ఎక్కువ సమయం గడపాలనుకుంటే.. పేరెంట్స్ పెట్టిన సమయ పరిమితిని అంగీకరించాలని సలహా ఇస్తున్నారు. ఎలాంటి బంధంలోనైనా సర్దుకుపోయినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొంటున్నారు. సలహా తీసుకోండి : ప్రతి సమస్యనూ మేమే పరిష్కరించుకోగలమని అనుకోవద్దంటున్నారు నిపుణులు. కొన్నింటికి అనుభవం అవసరమని చెబుతున్నారు. అందుకే, కష్టాన్ని, ఇబ్బందుల్ని మనసులో పెట్టుకోవద్దని తెలియజేస్తున్నారు. అమ్మానాన్నలతో మనసు విప్పి మాట్లాడటం, సలహా తీసుకోవడం మంచిదట.టీనేజీ పిల్లలు స్వతంత్రంగా ఉండాలనుకోవడం, ఫ్రెండ్స్?తో గడపాలనుకోవడం సర్వసాధారణం. ఆ మార్పుని పేరెంట్స్? గుర్తించడమే కాదు, అంగీకరించాలంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మీ పిల్లలు చేసే పనులు మీకు నచ్చకపోవచ్చట. కానీ, అవి హానికరం కానంత వరకూ చూసి చూడనట్లు వదిలేయడమే మేలని చెబుతున్నారు. అదే సమయంలో పొరపాటు జరిగినా సరే, పిల్లలు వచ్చి చెప్పుకొనే కమ్యూనికేషన్ మీ మధ్య ఉండాలని సూచిస్తున్నారు. అలాగే, పిల్లలు కూడా ఓ విషయాన్ని అర్థం చేసుకోవాలని సలహా ఇస్తున్నారు. ఈ వయసులో ఉత్సాహం, ఉద్రేకం అన్నీ ఎక్కువగానే ఉంటాయట. మీరు చేసే పని ఏదైనా సరే.. మీ కల్చర్, విలువలు, కుటుంబ పరిస్థితులకి సరిపడుతుందా? మీ ఫ్యామిలీ అంగీకరిస్తుందా అన్నది ఆలోచించుకోవాలని పేర్కొంటున్నారు. అలా కాకుండా ఇతరుల్లా మీరు ఉండాలనుకోవడం, పీర్ ప్రెజర్?లో పడి ఎదుటి వారిలా మీరూ ఉండాలని ప్రయత్నించడం మంచిది కాదని తెలియజేస్తున్నారు. ఏ సమస్య ఉన్న పేరెంట్స్?తో చెబితే సరిపోతుందని సూచిస్తున్నారు. వాళ్లు అర్థం చేసుకోవడం లేదనిపిస్తే అవసరాన్ని బట్టి మానసిక నిపుణుల సాయం తీసుకోవడం మంచిదట.

# 283 గజాల ప్రభుత్వ భూమి..

# మాజీ కార్పొరేటర్‌కు ఎలా?

- మహాదేవపురం సర్వే నంబర్ 329పై దుమారం
- ప్రభుత్వ స్థలంపై ప్రైవేట్ ఆధిపత్యం ఎలా? రెవెన్యూ రికార్డులు బయటపెట్టాలని స్థానికుల డిమాండ్

**కుత్బుల్లాపూర్ : ఆగస్టు 21 (పీపుల్స్ న్యూస్)**
మహాదేవపురం పరిధిలోని సర్వే నంబర్ 329లో సుమారు 283 గజాల స్థలానికి సంబంధించిన వ్యవహారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఈ స్థలం ప్రభుత్వ భూమి అయితే మాజీ కార్పొరేటర్‌కు ఈ భూమిపై ఆధిపత్యం ఎలా ఏర్పడిందన్న ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.



**రెవెన్యూ శాఖ రికార్డులు ఏం చెబుతున్నాయి?**
సంబంధిత భూమి ప్రభుత్వ స్థలమా? ఎవరి ఆధీనంలో ఉంది? ఏదైనా అధికారిక కేటాయింపు జరిగిందా? హక్కు పత్రాలు ఎవరి పేరుతో ఉన్నాయి? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**“ముడుపులు ఇస్తే సక్రమమా.. ఇవ్వకుంటే అక్రమమా?”**
రెవెన్యూ అధికారులపై ముడుపులకు సంబంధించిన ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.






**ప్రజల ఓట్లతో గెలిచి.. ప్రభుత్వ భూమిపై హక్కు ఎలా?**
ప్రజల ఓట్లతో పదవిలోకి వచ్చిన మాజీ ప్రజాప్రతినిధికి ప్రభుత్వ భూమిపై ప్రత్యేక హక్కు ఉంటుందా? ఉంటే దానికి సంబంధించిన అధికారిక పత్రాలు ఏమిటి? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

**రికార్డులు బయటపెట్టాలి**
సర్వే నంబర్ 329కు సంబంధించిన పహాణీ, 1-బి, సేత్వార్, సర్వే స్కెచ్, కేటాయింపు ఉత్తర్వులు, ఇతర రెవెన్యూ రికార్డులను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ భూమి అని రికార్డుల్లో తేలితే దానిని పరిరక్షించాలి. ఆక్రమణ లేదా అక్రమ లావాదేవీలకు సం బంధించిన ఆరోపణలు నిజమని విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మంత్రి నారా లోకేష్ పర్యటన విజయవంతం చేయండి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారి పిలుపు



**విజయనగరం, ఆగస్టు 21:** రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖల మంత్రి, యువ నాయకులు నారా లోకేష్ గారి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంత్రి నారా లోకేష్ గారు శనివారం మధ్యాహ్నం విజయనగరం చేరుకుని, విజయనగరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3.30 గంటల వరకు నిర్వహించే హెచ్‌ఆర్‌డీ క్లస్టర్ సమావేశంలో పాల్గొంటారన్నారు. అనంతరం సాయంత్రం 4 గంటల నుంచి 6.30 గంటల వరకు విజయనగరం మండలం చెల్లూరు గ్రామంలో పార్టీ క్యాడర్‌తో సమావేశంలో పాల్గొంటారని ఈ కార్యక్రమాలను జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.

## తడికలపూడిలో తాగునీటి తిప్పలు: వాటర్ ట్యాంకర్లే దిక్కు!



**కామవరపుకోట, ఆగస్టు 22:**
తడికలపూడి పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ నాగుల చెరువు గట్టు వద్ద ఉన్న మంచినీటి మోటార్ కేబుల్ వైరు పాడై సుమారు పది రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. నీటి సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు నీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. మోటార్ పునరుద్ధరణకు నానాటికీ ఆలస్యం అవుతుండటంతో, పంచాయతీ సరఫరా చేసే వాటర్ ట్యాంకర్ల వద్ద లేదా స్వచ్ఛందంగా తెప్పించే ట్యాంకర్ల వద్ద పెద్ద ఎత్తున బిందెలు, డ్రమ్ములు పట్టుకుని క్యూ లైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడింది. గంటల తరబడి కాచి ఉండి వాటర్ ట్యాంకర్ల నుండి నీటిని పట్టుకుంటూ కాలనీ ప్రజలు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ సమస్యను పది రోజులుగా పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించడంపై పంచాయతీ అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, మోటార్ కేబుల్‌ను బాగు చేయించి పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బోట్లపై కొరవడిన పర్యవేక్షణ - ప్రమాదాల బారిన మత్స్యకారులు

**విజయవాడ, ఆగస్టు 21, 2026**
రాష్ట్రంలో బోటు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఎందరో మత్స్యకారులు గల్లంతవుతున్నారు, ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ఫలితంగా బాధిత కుటుంబాలు వీధిన పడతున్న ఘటనలు జరుగుతున్నాయి. గల్లైంతైన వారి జాడ పట్టలేకపోతుంది అధికార యంత్రాంగం. మత్స్యకారుల సంక్షేమానికి, రక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు క్షేత్ర స్థాయిలో సరిగా అమలు కావడం లేదు. సముద్రంలోకి వేటకు వెళ్లే బోట్లపై సంబంధిత అధికారులకు పర్యవేక్షణ కొరవడుతోంది. అనుకోని ప్రమాదం జరిగినప్పుడు అధికార యంత్రాంగం ఉరుకులు పరుగులు పెడుతున్నారు. బాధితుల సమాచారం సైతం వారి వద్ద ఉండటం లేదు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అల్లవరం మండలం ఓడలరేవు గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు ఈ నెల 3న ఓడలరేవు తీరం నుంచి సముద్రంలో వేటకు వెళ్లారు. వేటకు వెళ్లిన మత్స్యకారులు గంట తర్వాత నుంచి స్థానికులకు అందుబాటులోకి రాలేదు. వేట ముగించుకుని పది రోజుల్లో రావాల్సిన వారు ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.జులై 1న విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు వేటకు వెళ్లారు. ప్రతికూల పరిస్థితులు, వర్షం, గాలి తీవ్రతకు తోడు అలల ఉధృతి గల్లంతు కాగా, బోటు డ్రైవర్ కమ్ ఓనర్ కారి చిన్నను వాణిజ్య నౌక సిబ్బంది కాపాడారు. మిగిలిన వారి ఆచూకి తెలియలేదు.ఆ ప్రాంతంలో ఎన్నిబోట్లు ఉన్నాయి? ఆ రోజు సముద్రంలోకి వేటకు ఎన్ని వెళ్లాయి? వాటిలో ఎందరు ఉన్నారు? ఎన్ని కిలోమీటర్ల వరకు వెళ్తారు? ఎన్నిరోజుల్లో తిరిగి వస్తారు? వంటి వివరాలు, చరవాణి నంబరు, బోటు రిజిస్ట్రేషన్ సంఖ్య, బోటు సామర్థ్య ధ్రువీకరణ పత్రాలు సిబ్బంది పరిశీలించి వేటకు అనుమతించాలి.సముద్రంలో వేట సాగించేందుకు వెళ్లే దిశానిర్దేశం చేయాల్సి ఉంది. జిల్లాలో ఈ ప్రక్రియ తూతూ మంత్రంగానే సాగుతోంది. సముద్రంలో వేటకు వెళ్తున్న బోటు పొడవు ఆధారంగా దాని రవాణా సామర్థ్యాన్ని నిర్ణయిస్తారు. మోటారు ఉంటాయి. జిల్లాలో 62 మెకనైజ్డ్ బోట్లు, 1800 వరకు మోటారు బోట్లు ఉన్నాయి.నడిసంద్రంలో ఇంజిన్? మొరాయింపు: వేట ముగించుకుని తీరానికి వచ్చే సమయంలో చేపల బరువు కారణంగా బోటు ఇంజిన్‌పై తీవ్ర భారం పడి ఒక్కొక్కసారి నడిసంద్రంలో మొరాయించి మత్స్యకారులను ప్రమాదంలోకి నెట్టేస్తుంది. జెట్టీల నుంచి సముద్రంలోకి వేటకు వెళ్లే బోట్లను పరిశీలించాల్సి ఉన్నా అధికారులు కార్యాలయాల్లో కూర్చుని సమాచారం సేకరిస్తుండటం గమనార్హం. దీనిపై మత్స్యశాఖ జేసీ కరుణాకర్ మాట్లాడుతూ జిల్లాలోని తీర ప్రాంతాల్లో సాగర్ మిత్రల ద్వారా రోజువారీ బోట్ల సమాచారాన్ని సేకరిస్తున్నామని, మత్స్యకారులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.గాలింపు: ఇదిలా ఉండగా ఓడలరేవు గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లి 18 రోజులైనా తిరిగి రాకపోవడంతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. దీనిపై అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ గురువారం మాట్లాడుతూ 4 రోజులుగా కోస్ట్‌గార్డ్ అధికారులు సముద్రంలో గాలిస్తున్నా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. సీఎం చంద్రబాబు సూచన మేరకు ఈ సమస్యను ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) దృష్టికి తీసుకువెళ్లి నౌకాదళ అధికారులను గాలింపు చర్యల్లో భాగస్వాముల్ని చేసినట్లు చెప్పారు. నౌకాదళ సిబ్బంది సముద్రాన్ని జల్లెడ పడుతున్నారన్నారు.

# యువతలో పారిశ్రామిక ఆలోచనలకు బాటలు

**ఆర్‌టీఐహెచ్‌లో ఐదు రోజుల శిక్షణా శిబిరం ముగింపు**





**విజయవాడ, ఆగస్టు 21, 2026**
రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్), విజయవాడ--ఎనికేపాడు ఆధ్వర్యంలో ఆగస్టు 17 నుంచి 21 వరకు నిర్వహించిన ఐదు రోజుల పారిశ్రామికవేత్తల శిక్షణా శిబిరం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ శిక్షణా శిబిరంలో పీబీ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులతో పాటు సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పారిశ్రామిక ఆలోచనా విధానం, సమస్యలను గుర్తించడం, వినూత్న పరిష్కారాలను రూపొందించడం, వ్యాపార ఆలోచనలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై వారికి అవగాహన, శిక్షణ అందించారు.కార్యక్రమంలో భాగంగా 21 వినూత్న వ్యాపార ఆలోచనలను విద్యార్థులు నిపుణుల ముందు ప్రదర్శించారు. పౌర సేవలు, ప్రజా రవాణా, ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీరు, వ్యవసాయం తదితర రంగాలకు సంబంధించిన ఆలోచనలను విద్యార్థులు వివరించారు. నిపుణులు విద్యార్థులకు విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు.ఈ సందర్భంగా ఆర్‌టీఐహెచ్ విజయవాడ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లిడా. హరి బాబులి మాట్లాడుతూ యువతలో సృజనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఆర్‌టీఐహెచ్ అందిస్తున్న అవకాశాలను వివరించారు. వినూత్న ఆలోచనలను ఆచరణలోకి తీసుకువచ్చి భవిష్యత్‌లో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.ఐదు రోజుల శిక్షణా శిబిరం విద్యార్థులకు ఆవిష్కరణలు, పారిశ్రామిక ఆలోచనలు, శిక్షణ, మార్గదర్శకత్వానికి మంచి వేదికగా నిలిచింది. కార్యక్రమం విజయవంతం కావడంలో ఆర్‌టీఐహెచ్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

శనివారం, ఆగస్టు 22, 2026 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 10

## మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో బిజెపి నుండి కాంగ్రెస్ లోకి భారీ చేరికలు

**- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి వాకిటి శ్రీహరి**



**నర్వ, 21 ఆగష్టు :** మండల పరిధిలోని యాంకి గ్రామానికి చెందిన బిజెపి నాయకులు సర్పంచులు వార్డ్ మెంబర్లు భారీగా కాంగ్రెస్ పార్టీలోకి చేరారు మంత్రి వాకిటి శ్రీహరి సర్పంచులను వాడు మెంబర్లను కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. యాంకి గ్రామానికి చెందిన సర్పంచ్ కళ్యాణి వెంకటన్న మాజీ ఉపసర్పంచ్ ఉప్పరి రమేష్ వార్డు సభ్యులు సహా 30 మంది కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై విశ్వాసంతో ప్రజా సంక్షేమం గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు ఇకపై కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. నర్వ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిసం చెన్నయ్య సాగర్ మాట్లాడుతూ యాంకికు గ్రామంలో చోటు చేసుకున్న భారీ చేరికలతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైందన్నారు రానున్న రోజుల్లో మరింత మంది నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## చింతలపూడి పోలీసుల ప్రత్యేక కవాతు



**చింతలపూడి, 21 ఆగస్టు :**
ఏలూరు జిల్లా చింతలపూడి పోలీసులు స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై జంగారెడ్డిగూడెం డిఎస్పి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చింతలపూడి సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది కి కవాతు నిర్వహించినట్లు ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ తెలిపారు. ఈ కవాతు వలన సిబ్బందికి దేహదారుఢ్యం, వృత్తిపరమైన క్రమశిక్షణ మరియు అప్రమత్తత పెరిగి మానసిక ఒత్తిడికి లోను కాకుండా విధులు నిర్వహించే అవకాశం ఉంటుందని సీఐ తెలిపారు. అనంతరం డా. నరేష్ (ఐటిబిపి) ఆధ్వర్యంలో సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శి తీరుపై బీజేపీ ఆదోని మండల అధ్యక్షుడు ఉషా రాజు ఆగ్రహం

**ఆదోని, 21 ఆగష్టు :** కపటి గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు విషయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ ఆదోని మండల అధ్యక్షులు ఉషా రాజు తీవ్రంగా మండిపడ్డారు.గ్రామంలో పలు వీధుల్లో దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాకాలం నడుస్తున్న నేపథ్యంలో విష పురుగుల భయం అధికంగా ఉందని, ఈ పరిస్థితుల్లో చిన్నారులు, వృద్ధులు రాత్రివేళ వీధుల్లో తిరుగాడాల్సి రావడం ప్రమాదకరమని పేర్కొన్నారు. వెంటనే అవసరమైన ప్రాంతాల్లో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, అలాగే పనిచేయని దీపాలను తక్షణమే మరమ్మతు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలపై అధికారులు నిర్లక్ష్య వైఖరిని వీడి, తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని ఉషా రాజు కోరారు.

## ఎంఐఎంలోకి మైనారిటీ నాయకుల చేరిక



**పెబ్బేరు, ఆగస్టు 21** మున్సిపల్ కేంద్రంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో శుక్రవారం పలువురు మైనారిటీ నాయకులు పార్టీలో చేరారు. ముబీన్, కమల్, ఖాజా, షానవాజ్, మహమ్మద్, అల్తాఫ్, ఆఫన్, అద్నాన్, తబ్రేజ్ లకు మండల అధ్యక్షుడు ఎం.డి. ఆఫ్రోజ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆఫ్రోజ్ మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని అన్నారు. ఆఫ్రోజ్ సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా చేరుతున్నామని, ఒవైసీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్తగా చేరిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# కోర్టులో కేసు ఉన్న భూమిని డిజిటల్ చేసేందుకు వ్యక్తి ప్రయత్నం

**- అధికారులను తప్పుదోవ పట్టించి భూమిని ఆన్లైన్ డిజిటల్ చేసుకోవాలని ప్రయత్నం అప్రమత్తమైన అధికారులు**

**నర్వ, 21 ఆగష్టు**
మండల కేంద్రంలోని జంగం రెడ్డిపల్లి గ్రామంలో కోర్టులో కేసు నడుస్తున్న భూమిని ఆన్లైన్ ( డిజిటల్) చేసుకోవాలని ప్రయత్నం చేసిన వ్యక్తి చేసిన ప్రయత్నాన్ని రెవెన్యూ అధికారులు సమస్ఫూర్తితో గుర్తించి అడ్డుకున్నారు.ఈ ఘటన జంగంరెడ్డి పల్లి గ్రామంలోని ఒక భూమికి సంబంధించి 2017 నుంచి కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది.కోర్టు పరిధిలో ఉన్న ఆ భూమిని తన పేరున డిజిటల్ ఎంట్రీ చేయించుకునేందుకు ఓ వ్యక్తి అధికారులను తప్పుదోవ పట్టించి దరఖాస్తు చేసుకున్నాడు.రికార్డులను పరిశీలిస్తున్న సమయంలో సదరు భూమిపై కోర్టులో వివాదం నడుస్తున్నట్లు అధికారులు గుర్తించారు.సమస్య కోర్టులో పెండింగ్‌లో ఉన్నట్లు స్పష్టమవడంతో ఆ ప్రక్రియను వెంటనే నిలిపివేసి వెనుదిరిగారు. కోర్టు వివాదాలున్న భూములను డిజిటల్ చేయడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు.కోర్టు వివాదాల్లో ఉన్న భూములకు సంబంధించి ఎలాంటి ఆన్‌లైన్ లేదా మ్యూటేషన్ ప్రక్రియలు



జరగకుండా రెవెన్యూ యంత్రాంగం మరింత నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# రైల్లో 24.3 కిలోల ఎండు గంజాయి పట్టివేత.. ఇద్దరు యువకుల అరెస్ట్

**నిజామాబాద్, 21 ఆగస్ట్**
నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో రైలు తనిఖీల్లో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది. విశ్వసనీయ సమాచారం మేరకు తెల్లవారుజామున 12.35 గంటల సమయంలో సాయి షిర్డీ రైలులో అర్పిఎఫ్ పోలీసులు, నిజామాబాద్ ఎస్ఎచ్ఓ ఆధ్వర్యంలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తులు తమ సీట్ల కింద రెండు సూట్‌కేసులతో అనుమానాస్పదంగా ప్రయాణిస్తుండటాన్ని పోలీసులు గుర్తించారు. సూట్‌కేసులను తనిఖీ చేయగా మొత్తం 24.3 కిలోల ఎండు గంజాయి లభించింది.దీంతో గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు.పోలీసుల విచారణలో తాము ఒడిశా నుంచి షిర్డీకి గంజాయిని తరలిస్తున్నామని నిందితులు తెలిపినట్లు అధికారులు వెల్లడించారు.ఈ రవాణా కోసం గుర్తుతెలియని వ్యక్తి తమకు రూ.10 వేల నగదు ఇచ్చి, షిర్డీలో ఒక నిర్దిష్ట ప్రదేశంలో ఆటో సిద్ధంగా ఉంటుందని, గంజాయిని ఆ ఆటోలో పెట్టి వెళ్లాలని



సూచించినట్లు వారు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన నిందితులు:గణేష్ పోలి (20), కుమార్ పోలి కుమారుడు, కలిమేఘి, జగిలిపడే పోస్టు, కోడాలా సబ్‌డివిజన్, గంజాం జిల్లా, ఒడిశా.దీపక్ సాహు (21), లోచన్ సాహు కుమారుడు, జగిలిపడే పోస్టు, గంజాం జిల్లా, ఒడిశా.స్వాధీనం చేసుకున్నవి :24.3 కిలోల ఎండు గంజాయి2 మొబైల్ ఫోన్లునిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని గౌరవ న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.ఈ తనిఖీల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ మల్లేష్,అర్పిఎఫ్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, పీఈసీ సిబ్బంది శైలేష్,సలీం, దేవేందర్‌తో పాటు ఆర్ పి ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మవారి నామస్మరణతో మార్మోగిన పెబ్బేరు అయ్యప్ప ఆలయం

**పెబ్బేరు,ఆగస్టు 21**
మున్సిపల్ కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో వరలక్ష్మీ వ్రత మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు.శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు.లలితా త్రిపుర సుందరిదేవి అమ్మవారికి అభిషేకాలు,సుందర అలంకరణలు చేసి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు.పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు.అర్చకులు వ్రత విశిష్టతను వివరించారు.వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.భజన కీర్తనలు,అమ్మవారి నామస్మరణ తో ఆలయం మార్మోగింది.వ్రతం అనంతరం అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించి,భక్తులకు తీర్థప్రసాదాలు,అన్నప్రసాద వితరణ చేశారు.అర్చకులు వెంకటేశ్వర్లుశర్మను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# విద్యార్థుల సమస్యలపై పోరాటమే లక్ష్యం.

**దౌల్తాబాద్ ఆగష్టు 21**
దౌల్తాబాద్‌లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నూతన కళాశాల కమిటీని ఏర్పాటు చేశారు. ఏబీవీపీ కళాశాల అధ్యక్షుడిగా ముద్ర కోళ్ల వరుణ్‌తేజ్, ఉపాధ్యక్షుడిగా అభి, అధ్యక్షురాలిగా కౌకూరి హర్షితను ప్రకటించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సేవాభావం, జాతీయ చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థుల విద్యా, సామాజిక సమస్యలపై ఏబీవీపీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రస్తు తం రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు, విద్యా సదుపాయాల కొరత, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ వంటి




సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం ఏబీవీపీ నిరంతరం ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నూతన సభ్యులు, ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# తొలి టెస్ట్‌లో ఘోర పరాజయం దిశగా పాకిస్థాన్



## నిప్పులు చెరిగిన ఇంగ్లండ్ జట్టు బౌలర్లు
## పెవిలియన్‌కు క్యూ కట్టిన పాక్ బ్యాటర్లు

ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో పాకిస్థాన్ ఘోర పరాజయం దిశగా సాగుతోంది. మూడు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా లీడ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో 238 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్థాన్.. 76 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ జట్టు ఇంకా 160 ప్లస్ రన్స్ వెనుకంజలో ఉంది. ఇంగ్లండ్ బౌలర్లు జోష్ టంగ్, జోఫ్రా ఆర్చర్, ఓలీ రాబిన్సన్ నిప్పులు చెరగడంతో పాక్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఓపెనర్లు అజాన్ అవైస్(9), ఇమామ్ ఉల్ హక్(0) తీవ్రంగా నిరాశపర్చగా.. షాన్ మసూద్(29) క్రీజులో నిలబడే ప్రయత్నం చేశాడు. కానీ అతన్ని జోష్ టంచ్ పెవిలియన్ చేర్చాడు. అబ్దుల్లా షఫీక్(15), సౌద్ షకీల్(14), కెప్టెన్ సల్మాన్ అఘా(4) కూడా వెనుదిరగడంతో పాక్ పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో మహమ్మద్ రిజ్వాన్(8 బ్యాటింగ్)తో పాటు అలి ఉస్మాన్(2 బ్యాటింగ్) ఉన్నాడు. మరో సెషన్నర ఆట మిగిలి ఉండగా.. మూడో రోజు ఆటలోనే ఈ మ్యాచ్ ఫలితం తేలనుంది. అదే జరిగితే.. పాకిస్థాన్ ఇన్నింగ్స్ తేడాతో ఓటమి పాలవ్వనుంది. అంతకుముందు 366/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 409 పరుగుల భారీ స్కోర్ చేసింది. జోర్డాన్ కాక్స్(73), కెప్టెన్ జోరూట్(66), హ్యారీ బ్రూక్(91), డాన్ లారెన్స్ సత్తా చాటారు. పాక్ బౌలర్లలో అలి ఉస్మాన్(5/95) ఐదు వికెట్లు తీయగా.. ఖుర్రమ్ షెహ్‌జాద్(3/133) మూడు వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ అబ్బాస్, మహమ్మద్ అలీ తలో వికెట్ తీసారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 171 పరుగులకే కుప్పకూలింది. అబ్దుల్లా షఫీక్(61) హాఫ్ సెంచరీతో రాణించగా.. ఇమామ్ ఉల్ హక్(42) పర్వాలేదనిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్సన్(5/51), జోష్ టంగ్(5/46) ఐదేసి వికెట్లతో పాకిస్థాన్ పతనాన్ని శాసించారు. గాయంతో బాబర్ ఆజామ్ ఈ మ్యాచ్‌కు దూరమవ్వడంతో పాక్ బ్యాటింగ్ లైనప్ బలహీనంగా మారింది. ఒక్క బ్యాటర్ కూడా క్రీజులో నిలబడలేకపోయాడు. మరోవైపు జో రూట్ అరుదైన ఘనత నమోదు చేశాడు. క్రీజులో పాతుకుపోయి ఆడిన రూట్ 112 బంతుల్లో 10 ఫోర్ల సాయంతో 66 రన్స్ చేసి పెవిలియన్ కు చేరాడు.

ఈ ఇన్నింగ్స్‌తో టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన ఇండియన్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ 68 ఫిఫ్టీల రికార్డును రూట్ సమంగా చేసి, చరిత్రకెక్కాడు. వెస్టిండీస్ గ్రేట్ శివనారాయణ్ చంద్రపాల్ 66 ఫిఫ్టీలతో రెండో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ అలెన్ బోర్డర్, ఇండియా దిగ్గజం రాహుల్ ద్రవిడ్ 63 ఫిఫ్టీలతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. కెప్టెన్‌గా 42వ సారి యాభై ప్లస్ స్కోరు సాధించిన రూట్ ఈ జాబితాలో ఐదో స్థానానికి చేరుకున్నాడు. సౌతాఫ్రికా మాజీ సారథి గ్రేమ్ స్మిత్ 61 స్కోర్లతో టాప్ స్థానం దక్కించుకున్నాడు.

# జహీర్ ఖాన్ సలహాతోనే నేను ఓపెనర్‌గా..



టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ విధ్వంసం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రెడ్ బాల్ క్రికెట్‌లో దూకుడుగా ఆడిన తొలి బ్యాటర్ సెహ్వాగ్ అనడంలో కూడా ఎలాంటి అతిశయోక్తి లేదు. 99, 199, 299 పరుగుల వద్ద కూడా సిక్సర్ బాదిన ఏకైక డాషింగ్ బ్యాటర్ సెహ్వాగ్. అయితే కెరీర్ ఆరంభంలో సెహ్వాగ్ లోయర్ మిడిలార్డర్‌లో ఆడేవాడు. ఆ తర్వాత ఓపెనర్‌గా ప్రమోషన్ అందుకొని ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అప్పటి కెప్టెన్ సౌరవ్ గంగూలీ.. సెహ్వాగ్ కోసం తన ఓపెనింగ్ స్థానాన్ని త్యాగం చేశాడని అంతా అనుకుంటారు. కానీ తనను ఓపెనర్‌గా ప్రమోట్ చేసింది గంగూలీ కాదని తాజాగా సెహ్వాగ్ వెల్లడించాడు. పాకిస్థాన్ మాజీ ప్లేయర్ షోయబ్ అక్తర్‌తో ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ వీరేంద్ర సెహ్వాగ్ ఈ విషయాన్ని పంచుకున్నాడు. ఏడో స్థానంలో బ్యాటింగ్ చేసే తనను ఓపెనర్‌గా ఆడించాలని గంగూలీకి జహీర్ ఖాన్ చెప్పాడని సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు. ఓపెనర్‌గా తాను విఫలమైతే జట్టు నుంచి తొలగించవద్దని గంగూలీని తాను వేడుకున్నానని, దానికి అతను హామీ ఇచ్చాడని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు. సచిన్ గాయంతో జట్టుకు దూరమవడంతో 2002లో ఇంగ్లండ్‌తో టెస్ట్ మ్యాచ్‌లో సెహ్వాగ్ ఓపెనర్‌గా అరంగేట్రం చేశాడు. తొలి బంతి నుంచే బౌండరీలు బాది టెస్ట్ క్రికెట్‌కు దూకుడు పరిచయం చేసిన సెహ్వాగ్.. 104 టెస్ట్‌ల్లో 23 సెంచరీలు, 32 హాఫ్ సెంచరీలతో 8586 పరుగులు చేశాడు. ఇందులో రెండు ట్రిపుల్ సెంచరీలు ఉన్నాయి. 251 వన్డేలు ఆడిన సెహ్వాగ్ 15 సెంచరీలతో 8273 పరుగులు సాధించాడు. ఇండోర్‌లో జరిగిన మ్యాచ్‌లో అతను 219 పరుగులతో డబుల్ సెంచరీ కూడా సాధించాడు. 2007 టీ20 ప్రపంచకప్ , 2011 వన్డే ప్రపంచ కప్‌లను భారత్ గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. సెహ్వాగ్‌ను ఓపెనర్‌గా ఆడించా లని జహీర్ ఖాన్ ఇచ్చిన సలహా.. భారత జట్టు రాతనే మార్చేసింది.




# సాత్విక్ చిరాగ్ శెట్టి జోడీ ఓటమి

బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి – చిరాగ్ శెట్టి ద్వయం పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో సాత్విక్– చిరాగ్ శెట్టి జోడీ ఓడిపోయింది. ఈ ద్వయం వరల్డ్ నెం 3 జోడీ లియాంగ్ వి కెన్– వాంగ్ చంగ్ (చైనా)ను క్వార్టర్స్‌లో ఢీ కొట్టింది. వరుస సెట్లలో 18–21 9–21 తేడాతో భారత ద్వయం ఓడిపోయింది. దీంతో వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో మూడో పతకం నెగ్గాలన్న సాత్విక్– చిరాగ్ ఆశలు ఆవిరయ్యాయి. సొంత అభిమానుల మధ్య భారీ అంచనాలతో దిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో, భారత జోడీ సాత్విక్ – చిరాగ్, చైనాకు చెందిన లియాంగ్ వీ కెంగ్ – వాంగ్ చాంగ్‌తో తలపడ్డారు. మ్యాచ్ తొలి సెట్ హోరాహోరీగా సాగింది. తొలి నుంచే ఇరు జట్ల ఆటగాళ్లు అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పోటీపడి పాయింట్లు సాధించడంతో ఆట ఉత్కంఠభరితంగా సాగింది. అయితే భారత జోడీ గట్టిగా పోరాడినప్పటికీ, మొదటి సెట్‌ను చైనా ద్వయం 21– 18తో కైవసం చేసుకుంది. దీంతో రెండో సెట్‌లో సాత్విక్ – చిరాగ్ కమ్‌బ్యాక్ ఇస్తారని అభిమానులు ఆశించారు. కానీ, మొదటి సెట్ విజయం ఇచ్చిన ఉత్సాహంతో చైనా జోడీ రెండో సెట్ ఆరంభం నుంచే తమ ఆధిపత్యాన్ని కొనసాగించింది. మరింత దూకుడు పెంచి ధనాధన్ షాట్లతో పాయింట్లు సాధించింది. దీంతో చైనా జోడీ వరుసగా రెండో సెట్‌ను కూడా సొంతం చేసుకుంది. ఫలితంగా లియాంగ్ వీ కెంగ్ – వాంగ్ చాంగ్ ద్వయం సెమీఫైనల్‌కు అర్హత సాధించడమే కాకుండా, పతకాన్ని ఖాయం చేసుకుంది. ఈ టోర్నమెంట్‌లో సాత్విక్– చిరాగ్ జోడీ పతకం తీసుకొస్తుందని అభిమానులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. కానీ ఇలా క్వార్టర్స్‌లోనే ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించడంతో అభిమానులు నిరాశకు లోనయ్యారు. ఇటీవల సింగపూర్ ఓపెన్ వంటి అంతర్జాతీయ టోర్నమెంట్లలో టైటిల్స్ గెలిచి అద్భుతమైన ప్రదర్శన చేసిన ఈ జోడీ, సొంత గడ్డపై ఓడిపోవడం భారత అభిమానులను నిరుత్సాహానికి గురిచేస్తుంది. కాగా, గురువారం మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు కూడా ప్రీ క్వార్టర్స్‌లో ఓడిపోయింది.

# క్వార్టర్ ఫైనల్స్‌లో ట్రీసా జాలీ




భారత్‌కు తొలి పతకం ఖాయమైంది. భారత స్టార్ ద్వయం ట్రీసా జాలీ– గాయత్రి గోపిచంద్ క్వార్టర్ ఫైనల్‌లో విజయం సాధించింది. ఈ జోడి శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్‌లో ఫైనల్‌లో చైనాకు చెందిన జియా యి ఫాన్, జాంగ్ షు జియాన్‌పై 16–21, 21–15, 21–13 తేడాతో విజయం సాధించింది. దీంతో ట్రీసా– గాయత్రి జోడీకి పతకం (కనీసం కాంస్యం) ఖాయమైంది. ఈ మ్యాచ్ తొలిసెట్లో భారత ద్వయంపై చైనా జోడీ జియా యి ఫాన్, జాంగ్ షు జియాన్‌దే ఆధిపత్యంగా సాగింది. ట్రీసా– గాయత్రి పోరాడినప్పటికీ ప్రత్యర్థి జోడీ దూకుడుగా ఆడి తొలి సెట్‌ను 21–16తో సొంతం చేసుకుంది. అయితే రెండో సెట్‌లో భారత జోడీ సూపర్ కమ్‌బ్యాక్ ఇచ్చింది. ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా ధనాధన్ షాట్లతో ఎటాక్‌కు దిగింది. మ్యాచ్‌లో నిలవాలంటే తప్పక నెగ్గాల్సిన సెట్‌ను ట్రీసా– గాయత్రి ద్వయం 21–15తో సొంతం చేసుకుంది. దీంతో మ్యాచ్ ఫలితం కోసం మూడో సెట్ ఆడాల్సి వచ్చింది. అయితే ఇండియన్ షట్లర్లు అదే జోరును ప్రదర్శించారు. ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టి మూడ సెట్‌ను 21–13 భారీ తేడాతో గెలుచుకున్నారు. మొత్తం గంటా తొమ్మిది నిమిషాల పాటు సాగిన ఆటలో 16–21, 21–15, 21–13 తేడాతో విజయం సాధించిన ట్రీసా– గాయత్రి సెమీస్‌కు దూసుకెళ్లింది. దీంతో మన షట్లర్లకు కనీసం కాంస్య పతకం ఖాయమైంది. కాగా, బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్‌లో భారత్ చివరిసారిగా 2011లో పతకం సాధించింది. లండన్ వేదికగా జరిగిన ఆ పోటీలో భారత షట్లర్ జోడీ జ్వాలా గుత్తా – అశ్విని పొన్నప్ప కాంస్య పతకం గెలుచుకుంది. మళ్లీ 15ఏళ్లకు ఈ విభాగంలో భారత్ పతకం అందుకోనుంది. 2022, 2023 సంవత్సరాలలో ట్రీసా – గాయత్రి జోడీ వరుసగా ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ సెమీఫైనల్స్‌కు చేరుకుంది. 2022లో కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకాన్ని కూడా గెలుచుకుంది. గతేడాది ప్రారంభంలో టాప్ 10లోకి ప్రవేశించింది. అయితే, ఈ సంవత్సరం ప్రారంభంలో ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్, ఉబెర్ కప్‌కు ముందు శిక్షణ తీసుకుంటుండగా ట్రీసా చీలమండకు గాయమైంది. ప్రాక్టీస్ చేస్తుండగా ఆమె అనుకోకుండా ఆమె చీలమండ బెణికింది. దీంతో ట్రీసా రిహాబిలిటేషన్‌కు వెళ్లింది. గాయం నుంచి పూర్తిగా కోలుకొని ఇటీవల ఇండోనేసియా ఓపెన్‌లో ఈ ద్వయం మళ్లీ బరిలోకి దిగింది. ఆపై యూఎస్ ఓపెన్, ఈ నెల ప్రారంభంలో ఫిలిప్పైన్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో విజేతగా నిలిచింది. ఇప్పుడు వరల్డ్ ఛాంపియన్స్‌షిప్స్‌లోనూ పతకం ఖాయం చేసుకుంది.

# సచిన్ రికార్డును సమం చేసిన రూట్

హైదరాబాద్ : పాకిస్తాన్, ఇంగ్లాండ్ మధ్య టెస్ట్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో జో రూట్ అరుదైన ఘనత సాధించాడు. పాక్ తో జరుగుతున్న తొలి టెస్ట్ సందర్భంగా 68వ అర్థ సెంచరీ పూర్తి చేసుకున్న ఇంగ్లాండు టెస్ట్ కెప్టెన్ రూట్... సచిన్ టెండూల్కర్ రికార్డ్ ను సమం చేశాడు. సచిన్ టెండూల్కర్ ఇప్పటి వరకు 68 అర్థ సెంచరీలు టెస్టులలో సాధించారు.ఆ తర్వాత చందర్ పాల్ 66, బోర్డర్ 63, రాహుల్ ద్రావిడ్ 63 అర్థ సెంచరీలు నమోదు చేశారు.



శనివారం, ఆగస్టు 22, 2026 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 12

# వందకోట్ల క్లబ్బులోకి డిసి మూవీ




టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డీసీ' సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు.

శరత్ చంద్ర చటోపాధ్యాయ క్లాసిక్ నవల 'దేవదాస్' స్ఫూర్తితో, అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్ మరియు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా, చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.

# నటి షావుకారు జానకి మృతి

### వయోసంబంధ అస్వస్థతో కన్నుమూత షావుకారు సినిమాతో పేరు స్థిరం




తెలుగు చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం ఆమె మృతి చెందారు. షావుకారు జానకి ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలనుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో.. అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులు అర్పించటం కోసం ఉంచుతామని తెలిపారు. టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. విజయవారి 'షావుకారు' సినిమాతో 1950లో జానకి సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. 'షావుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 380 చిత్రాలలో నటించారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో కనిపించారు.

భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కేవలం నాయికగానే కాకుండా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ వైవిధ్యం చాటుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కళారంగానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించింది. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.

# ఇరుముడి ఎమోషనల్ డ్రామా




రవితేజ హీరోగా 'ఇరుముడి' అనే టైటిల్ ప్రకటించినప్పటి నుంచే ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఇందులోని పాటలు, ట్రైలర్‌లో చూపించిన ఫ్యామిలీ ఎమోషన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. కచ్చితంగా రవితేజకి ఇది కమ్‌బ్యాక్ సినిమా అవుతుందని

అందరూ భావించారు. పీలేరు ప్రాంతంలో త్రినాథ్(రవితేజ) ఆటో నడుపుతూ, అరటిపళ్ల వ్యాపారం చేస్తూ కూతురు మణెమ్మ(నక్షత్ర), భార్య కావేరి(ప్రియా భవానీ శంకర్)తో ఆనందంగా జీవిస్తుంటాడు. ఆ ప్రాంతంలో అందరి ఆడపిల్లలని తన కూతురులానే చూస్తుంటాడు. తనకు మద్యం అలవాటు ఉంటుంది. కాకపోతే అయ్యప్ప స్వామి మాలలో ఉన్నప్పుడు మాత్రం మందు జోలికి వెళ్లడు. అదే ప్రాంతంలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనూహ్యంగా చనిపోతుంది. ఆ మరణం వెనుక ఉన్నది ఎవరు? ఈ చావు త్రినాథ్ కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేసిందనేది మిగతా కథ. తెలుగులో చాలా క్రైమ్ థ్రిల్లర్స్ వచ్చాయి. కాకపోతే కుటుంబ, అయ్యప్ప మాల నేపథ్యంలో ఒక ఎమోషనల్ థ్రిల్లర్‌గా 'ఇరుముడి' ప్రత్యేకంగా కనిపిస్తుంది. సినిమా కథ ప్రారంభం ఓ స్కూల్లో టీచర్ సస్పెండ్ అవడంతో మొదలవుతుంది. ఆ తర్వాత కుటుంబం, మణెమ్మతో ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ను ఎస్టాబ్లిష్ చేయడానికి కొంత సమయం పడుతుంది. ఎప్పుడైతే పదో తరగతి చదువుతున్న ఓ అమ్మాయి అనూహ్యంగా చనిపోతుందో, అక్కడి నుంచి కథలో ఉత్కంఠ పెరుగుతుంది. అది విరామానికి వచ్చేసరికి ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి, ఎమోషన్ కలిగిస్తుంది. ఈ కథను దర్శకుడు హ్యాండిల్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. కథలో మంచి ట్విస్టులు రాసుకున్నారు. ఒక హార్ట్ టచింగ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా కథను దర్శకుడు శివ నిర్వాణ నడిపించారు. అదే సమయంలో ఒక బలమైన సందేశం కూడా ఇచ్చారు. ఆ సందేశం కచ్చితంగా గుర్తుపెట్టుకుని పాటించదగ్గదిగా ఉంటుంది. రవితేజ తన మాస్ ఇమేజ్‌ను పక్కన పెట్టి పూర్తిగా ఎమోషనల్ క్యారెక్టర్‌లో నటించారు. త్రినాథ్ పాత్రలో ఆయన పెర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉంటుంది. ఒకవైపు ఎమోషనల్ తండ్రిగా, మరోవైపు మద్యానికి బానిసైన వ్యక్తిగా, అయ్యప్ప మాల వేసుకున్న భక్తుడిగా, చివర్లో ఒక తండ్రిగా.. తన పాత్రలో చాలా వేరియేషన్స్ ఉన్నాయి. ఆ వేరియేషన్స్ అన్నింటినీ రవితేజ చాలా పరిణతితో కనబరిచారు. అలాగే మణెమ్మ పాత్రలో చేసిన బేబీ నక్షత్ర పాత్ర కూడా చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. రవితేజ భార్య పాత్రలో కనిపించిన ప్రియా భవానీ శంకర్ పోషించిన కావేరి పాత్ర కూడా చాలా హుందాగా ఉంటుంది. ఆ పాత్ర ఈ సినిమాకు కావాల్సిన ఎమోషన్‌ను యాడ్ చేసింది. గురుస్వామి పాత్రలో చేసిన సాయికుమార్ పాత్ర ఆయనకు చాలా కొత్తగా, అదే సమయంలో ప్రభావవంతంగా ఉంటుంది. సెకండ్ హాఫ్‌లో ఆ పాత్రకు దర్శకుడు రాసుకున్న ఒక మలుపు కూడా కథకు బలాన్ని చేకూర్చింది. అలాగే అజయ్ ఘోష్ పాత్ర కూడా కావాల్సిన క్యూరియాసిటీని పెంచింది. మిగతా నటీనటులు పరిధి మేరకు కనిపించారు. సీలేరు ప్రాంతంలో తీసిన చిత్రమిది. అన్ని ఒరిజినల్ లొకేషన్స్ కావడంతో కథ నిజంగా అక్కడే జరుగుతున్నట్టుగా అనుభూతిని కలిగించింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి.

# హాయ్ చిత్రం ట్రైలర్ విడుదల



లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ యంగ్ హీరో కవిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా మూవీ 'హాయ్'. ప్రముఖ గీత రచయిత విష్ణు ఎడవన్ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 28న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తమిళంతో పాటు తెలుగు ట్రైలర్‌ను వదిలింది. ఈ ట్రైలర్ ఫుల్ లవ్, ఫన్ మరియు ఎమోషన్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ వివాహాల కోసం ప్రయత్నించి విఫలమయ్యే సామాన్యుడిగా కవిన్ ఇందులో కనిపించగా, ఆయనకు దేవసేన పాత్రలో నటిస్తున్న నయనతార ఎదురుకావడం జరుగుతుంది. సంప్రదాయాలకు భిన్నంగా ఉండే ఒక స్వతంత్ర భావాలున్న మహిళగా నయనతార లుక్ చాలా ఆకర్షణీయంగా ఉంది. అనుకోని పరిస్థితుల నేపథ్యంలో వీరిద్దరికీ పెళ్లి జరగడం, ఆ తర్వాత వారి మధ్య జరిగే మనస్పర్థలు, భావోద్వేగాలు ఈ సినిమా ప్రధాన కథాంశంగా ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. కవిన్, నయనతార ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా ఉండి సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇక ఈ చిత్రంలో నయనతార, కవిన్‌లతో పాటు కే. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్ వంటి దిగ్గజ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జెన్ మార్టిన్ సంగీతం అందిస్తుండగా, రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. జి స్టూడియోస్ సౌత్, రౌడీ పిక్చర్స్ మరియు సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి.



# 'స్పిరిట్'లో ప్రకాశ్ రాజ్ లేరు.. క్లారిటీ ఇచ్చిన నిర్మాత

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'స్పిరిట్' చిత్రం నుంచి ఒక కీలక అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమాలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ నటించడం లేదని అధికారికంగా స్పష్టత వచ్చింది. చిత్ర నిర్మాత ప్రణయ్ వంగా స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈ చిత్రంలోని జైలర్ పాత్ర కోసం తొలుత ప్రకాశ్ రాజ్‌ను సంప్రదించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల అది సాధ్యపడలేదని ఆయన స్పష్టం చేశారు. గత ఏడాది విడుదలైన టీజర్‌లో ప్రకాశ్ రాజ్ వాయిస్ ఓవర్ వినిపించడంతో ఆయన ఈ ప్రాజెక్టులో భాగమయ్యారని అందరూ భావించారు. అయితే, ఆ తర్వాత ఆయన ఈ సినిమా నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా నిర్మాత చేసిన ప్రకటనతో ఆ వార్తలకు బలం చేకూరినట్లయింది.

మరోవైపు 'స్పిరిట్' చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి అతిథి పాత్రలో కనిపించనున్నారంటూ వస్తున్న ఊహాగానాలకు కూడా ప్రణయ్ వంగా తెరదించారు. ఈ సినిమాలో చిరంజీవి ఎలాంటి క్యామియో చేయడం లేదని ఆయన తేల్చి చెప్పారు.

# ఆదిత్యరాయ్ మూవీలో భాగ్యశ్రీ భోర్సే

## వార్తలను తోసిపుచ్చిన టీ సీరిస్



టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి.భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్‌తో పాటు నటనతోనూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు ఆమె తలుపు తట్టాయి.దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కాంత' లోనూ భాగ్యశ్రీ నటించింది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com